ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



5

బాపట్ల జిల్లా వార్తలు

గురువారం 12 డిసెంబరు 2024



చిలకలూరిపేట మేజర్ కాలువ

- సాగునీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం
- 14న నీటి సంఘాలకు.. 17న డీసీలకు ఓటింగ్
- ఏర్పాట్లలో అధికారులు.. నాయకుల సమాయత్తం

ఎట్టకేలకు ఎన్నికలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో ఊసెత్తని.. కూటమి ప్రభుత్వ హయాంలో రెండు సార్లు వాయిదా పడిన.. సాగునీటి సంఘాల ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ విడుదలైంది. గ్రామాల్లో ఒక వైపు రైతులు వరి కోతల హడావుడిలో ఉండగా మరోవైపు ఎన్నికల సమరానికి తెరలేచింది. దీంతో పల్లెల్లో నీటి సంఘాల ఎన్నికల సందడి నెలకొంది. ఈ నెల 14న నీటి వినియోగదారుల సంఘాల(డబ్ల్యూయూఏ)కు, 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీల(డీసీ)కు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల నిర్వహణకు జలవనరుల, రెవెన్యూ శాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు సాగు నీటి సంఘాల వారీగా అధికారులను నియమించారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సమస్యాత్మక నీటి సంఘాలను గుర్తించారు. వీటి ఎన్నికలకు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖను అధికారులు ఇప్పటికే కోరారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. వాయిదాల అనంతరం ఎట్టకేలకు నోటిఫికేషన్ విడుదలతో రాజకీయ పార్టీలకు చెందిన గ్రామ నాయకులు ఎన్నికలపై దృష్టి సారించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు, సిబ్బందికి శిక్షణను పూర్తి చేశారు. ఎన్నికల సామగ్రిని కూడా సిద్ధం చేశారు. ఎన్నికలను అధికార పార్టీ ప్రతిష్ఠాత్మకంగా స్వీకరించింది. సేవా భావం కలిగిన వారిని నీటి సంఘాలకు ఎన్నుకోవాలని ఇప్పటికే కూటమి నేతలు పిలుపునిచ్చారు. ఈ ఎన్నికలపై వైసీపీ దృష్టి సారించిన దాఖలాలు లేవు.

సాగర్ పరిధిలో 274 నీటి సంఘాలు

నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో మేజర్, మైనర్ ఇరిగేషన్‌లో 274 సాగు నీటి సంఘాలు ఉన్నాయి. ఒక్కొక్క సంఘం పరిధిలో 12 టీసీల చొప్పున మొత్తం 2,628 టీసీలు ఉన్నాయి. టీసీల వారీగా ఓటర్ల జాబితాలను రెవెన్యూ శాఖ సిద్ధం చేసింది. ఒక్కొక్క టీసీ పరిధిలో 2,500 నుంచి 3,000 మంది రైతులు ఓటర్లుగా నమోదయ్యారు. టీసీలకు 14న ఎన్నికలు జరగనుండగా అదే రోజున సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. నీటి సంఘాలకు కాల్వ ఎగువ భూముల పరిధిలోని టీసీని అధ్యక్షుడిగా ఎన్నుకుంటే దిగువ భూముల టీసీని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు డిస్ట్రిబ్యూటరీ కమిటీని ఎన్నుకుంటారు. 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు 17న ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అయితే ప్రాజెక్టు కమిటీ ఎన్నికల తేదీని ప్రకటించాల్సి ఉంది. కుడి కాల్వ పరిధిలో 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. నీటి పంపిణీలో ఇవి కీలక పాత్ర పోషించనున్నాయి. మాచర్ల, గురజాల, కారంపూడి, కేసానుపల్లి, పిడుగురాళ్ల, తంగెడ, బెల్లంకొండ, క్రోసూరు, చామర్రు, నకరికల్లు, ముప్పాళ్ల, సత్తెనపల్లి, మేడికొండూరు, పెదకూరపాడు, అమరావతి, ఫిరంగిపురం, గుంటూరు, పొన్నెకల్లు, లింగంగుంట్ల, చిలకలూరిపేట-1, 2, పెదనందిపాడు, సంతగుడిపాడు, రొంపిచర్ల, గంటావారిపాలెం, వినుకొండ, చీకటీగలపాలెం, ఐనవోలు, త్రిపురాపురం, ములకలూరు, సంతమాగులూరు, కొమ్మాలపాడు డీసీలు ఉన్నాయి.



- గంటల కొద్దీ ఆలస్యంగా నడుస్తున్న రైళ్లు
- గమ్యస్థానం చేరే సమయంపై అయోమయం
- రోజువారీ ప్రయాణికులు, ఉద్యోగులు పడరానిపాట్లు
- ఇష్టారాజ్యంగా రైళ్ల రద్దు.. అరకొర రైళ్లపై తీవ్ర ఒత్తిడి



రైలు ప్రయాణం నరకం

గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడు వస్తాయో తెలియదు.. ఎప్పుడు బయల్దేరతాయో అర్థం కాదు.. ఇదీ ప్రస్తుతం రైళ్ల పరిస్థితి. గంటల తరబడి ఆలస్యంగా నడుస్తున్న రైళ్లు.. ఆ రైళ్లలో ఎక్కి ఎప్పటికి గమ్యస్థానానికి చేరుతామో తెలియదు.. ఇదీ ప్రయాణికుల కష్టాలు. ఇష్టం వచ్చినట్లు రైళ్లను రద్దు చేస్తున్నారు.. అయినా రైళ్ల రాకపోకల్లో తీవ్ర జాప్యం. ఒకప్పుడు సమయానికి వచ్చి సమయానికి గమ్యస్థానాలకు చేర్చుతూ ప్రయాణికుల ఆదరణను పలు రైళ్లు పొందాయి. అయితే గత కొంతకాలంగా రైళ్ల రాక.. పోక అనేది ఎవరికీ తెలియడంలేదు. రైల్వే అధికారులు కూడా రైళ్ల రాకపోకల గురించి చెప్పలేకపోతున్నారు. తాను ఎక్కబోయే రైలు జీవితకాలం లేటు అన్న నానుడిని నిజం చేసేలా ప్రస్తుతం రైలు ప్రయాణం మారింది. రైలులో ప్రయాణం అంటే కోరుకుని నరకానికి ప్రయాణం కట్టినట్లే అన్నట్లుగా మారింది పరిస్థితి. సీజన్‌పై రోజువారీ ప్రయాణాలు చేసే ఉద్యోగులు, విద్యార్థుల పరిస్థితి గురించి చెప్పాలంటే అది నిత్య నరకమే. గుంటూరు నుంచి పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, పిడుగురాళ్ళ, మాచర్ల, వినుకొండ, బాపట్ల జిల్లా పరిధిలోని బాపట్ల, చీరాల, రేపల్లె రూట్లలో నడిచే రైళ్లు, పక్క జిల్లాల్లోని విజయవాడ, నరసాపురం రూట్లలో నడిచే రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడుస్తున్నాయి.

పదుల కిలోమీటర్లు.. గంటల ప్రయాణం

గుంటూరు నుంచి విజయవాడ మధ్య దూరం 30 కి.మీ. కాగా అందుకోసం 2 నుంచి 3 గంటల సమయం పడుతున్నది. 120 కి.మీ దూరం ఉన్న గుంటూరు- మాచర్ల మధ్య ప్రయాణం 4 నుంచి 6 గంటల సమయం పడుతోంది. సాయంత్రం 7.35కు గుంటూరు చేరుకోవాల్సిన మాచర్ల రైలు ఈ వారంలో రెండు రోజులు రాత్రి 10.30 వరకూ గుంటూరుకు రాలేదు. ఒకటి రెండు రోజులు మినహా మిగిలిన అన్ని రోజులూ ఆ రైలు ఆలస్యంగా వస్తోంది. దీంతో ప్రయాణికులు అల్లాడిపోతున్నారు. హుబ్లీ రైలు ఈ నెల 6న రాక, పోకలు రెండూ ఐదు గంటలు ఆలస్యంగా సాగాయి. గుంటూరు- విజయవాడల మధ్య తిరిగే ఇంటర్‌సిటీ మెమూ రైళ్లు రెండు మూడు గంటల సగటు జాప్యంతో తిరుగుతున్నాయి. గడిచిన నాలుగు రోజులుగా 30 కి.మీ ప్రయాణానికి ఈ రైళ్లు 4 గంటల సమయం తీసుకుంటున్నాయి. ఉదయం 11.30కి గుంటూరులో బయలుదేరి

(మిగతా 8వ పేజీలో)



గుంటూరు కేవీపీ కాలనీలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం

- నాడు-నేడు పేరు మార్పుతో సరి
- పాఠశాలల్లో పునః ప్రారంభంకాని పనులు
- పాడైపోతున్న నిర్మాణ సామగ్రి.. ప్రజాధనం వృథా
- అటకెక్కిన అభివృద్ధి పనులపై దృష్టి సారించని పాలకులు
- నిధులు విడుదల కాక గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా పనులు

గుంటూరు కేవీపీ కాలనీలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం

ఆరునెలలైనా.. అసంపూర్తిగానే

ప్రభుత్వ పాఠశాలలను నాడు- నేడు పేరుతో తీర్చిదిద్దుతున్నామన్నారు.. కార్పొరేట్ పాఠశాలకంటే మిన్నగా మారుస్తామన్నారు.. తొమ్మిది రకాలు పనులు చేపట్టారు.. వందల్లో పాఠశాలలను ఎంపిక చేసి రూ.కోట్లలో నిధులు మంజూరు చేశారు.. ఉన్న భవనాలను పడగొట్టారు.. అయితే నిధులు విడుదల చేయకుండా పాఠశాలలను గత పాలకులు పాడుబెట్టారు. కూటమి ప్రభుత్వం పాఠశాలల దుస్థితిని చూసి, వాటిని సరిదిద్దేందుకు సంకల్పించింది. తొలుత నాడు-నేడు పేరును మనబడి మన భవిష్యత్తుగా మార్చింది. దీంతో అటకెక్కిన పనులు ప్రారంభమవుతాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు కూడా భావించారు. కానీ ఆరు నెలలుగా అసంపూర్తిగానే పనులు ఉన్నాయి.

గుంటూరు(విద్య), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం గత ప్రభుత్వం నాడు నేడు పథకం పేరుతో ప్రారంభించి వదిలేసిన పనులు ఇప్పటికీ అనేక చోట్లు అలాగే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం పథకం పేరును మార్చడంతో సరిపెట్టిందే కానీ పనుల పునః ప్రారంభంపై దృష్టి సారించలేదు. పనులపై రాష్ట్రస్థాయిలో సమీక్ష నిర్వహించక పోవడంతో జిల్లా స్థాయిలో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయని తెలుస్తోంది. ఫలితంగా నిర్మాణ సామగ్రి అనేక చోట్లు పాడైపోతోంది. కొన్ని చోట్ల దొంగల పాలౌతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

పెండింగ్‌లోనే అభివృద్ధి పనులు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత ప్రభుత్వం నాడు నేడు పేరుతో చేపట్టిన పనులు ప్రభుత్వం మారినా ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం, తాగునీటి కోసం వాటర్ ప్లాంట్స్ గ్రీన్‌చాక్ బోర్డులు, ఇంగ్లీషు ల్యాబులు, కిచెన్‌షెడ్లు, సైన్స్ ల్యాబుల నిర్మాణం, విద్యార్థులు, సిబ్బందికి ఫర్నిచర్ సౌకర్యం, రంగులు వేయడం తదితర తొమ్మిది రకాల పనుల్ని చేపట్టగా ఆయా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. గత ప్రభుత్వం నాడు నేడు పథకంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2 వేలకుపైగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు జడ్పీ పాఠశాలల్ని ఎంపిక చేసి దాదాపు రూ.వెయ్యి కోట్లకు పైగా బడ్జెట్ కేటాయింపులు చేసింది. కానీ నిధుల విడుదల మాత్రం 40 శాతం కూడా చేయలేదు. ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇప్పటికీ 45 శాతంపై పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. వందల సంఖ్యలో భవన నిర్మాణ పనులు ఇంకా వివిధ దశల్లోనే ఉన్నాయి. కొన్ని చోట్ల పునాదుల స్థాయిలో మరికొన్ని చోట్ల శ్లాబ్ పూర్తి అయినా పార్టీషన్, ప్లాస్టింగ్, విద్యుత్, ప్లంబింగ్ పనులు పూర్తికాలేదు. నిర్మాణ సామగ్రి అనేక చోట్ల పాడైపోతోంది. ఇసుక, కంకర, డస్ట్ ఇప్పటికే అనేక పాఠశాలల్లో మట్టిలో కలిసిపోయింది. సిమెంట్‌కు రక్షణ లేకపోవడంతో గడ్డకట్టి ఉపయోగించడానికి వీలులేకుండా మారింది. శానిటరీ, ప్లంబింగ్, విద్యుత్ పరికరాలు తరగతి గదుల్లో పేరుకుని పోయి ఉన్నాయి. కొన్ని ఇప్పటికే ధ్వంసం కాగా, మరికొన్ని దొంగలపాలైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా కోట్లాది రూపాయల ప్రజాధనం వృథాగా మారిందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. అనేక పాఠశాలల్లో తాగునీటి పథకాల ఏర్పాటు చేసినా వినియోగంలోకి రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అసంపూర్తి పనులపై దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



గుంటూరులోని ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో గడ్డకట్టి పాడైపోయిన సిమెంట్ బస్తాలు

మిర్చియార్డు చైర్మన్.. మళ్లీ ఓసీకే 8
- కలెక్టర్ ఆమోదంతో త్వరలో గెజిట్ నోటిఫికేషన్

టూరిజం అభివృద్ధికి సీఎం నూతన పాలసీ 6
- టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బాలాజి

కృత్రిమ మేధ ద్వారా విస్తృత పరిశోధనలు
రెండు రోజుల జాతీయ సదస్సులో ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు

చిరుజల్లులతో రైతుల్లో ఆందోళన

- సురక్షిత ప్రాంతాలకు ధాన్యం తరలింపు

రేపల్లె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ముమ్మరంగా నూర్పుళ్లు జరుగుతున్నాయి.. పొలాల్లోనే కోసిన ధాన్యం రాశులున్నాయి.. ఈ పరిస్థితుల్లో బుధవారం ఆకాశం మేఘావృతమై వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. అల్పపీడన ప్రభావంతో బుధవారం తీరప్రాంతంలో చిరుజల్లులు పడ్డాయి. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. హార్వెస్టు మిషన్ ద్వారా కోసిన ధాన్యాన్ని రహదారుల వెంబడి, పొలం గట్ల మీద, కరకట్ట వెంబడి రైతులు ఆరబెట్టుకుని ఉన్నారు. ఉదయం 11 గంటల సమయంలో మబ్బు పట్టి ఉండటంతో రైతుల్లో భయాందోళన మొదలైంది. రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లో వర్ష ప్రభావం లేదని కోతలు కోసుకుని ఉన్నారు. వర్షంతో చేతికొచ్చిన పంటంతా నేలపాలవుతుందోమోనని రైతులు కంగారుపడుతున్నారు. ఆరబెట్టుకున్న ధాన్యాన్ని పట్టాలు కప్పుకుంటూ గోతాల్లోకి ఎత్తుకుని సురక్షిత ప్రాంతాల్లోకి తరలించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటి నుంచి రైతులపై ప్రకృతి కన్నెర్ర చేసింది. ఇప్పటికి మూడుసార్లు తుఫాన్ ప్రభావంతో రైతులకు కొంతమేర నష్టం వాటిల్లింది. వారం రోజులు వర్షం లేకుంటే పంటంతా ఇంటికి చేరుతుందని రైతులు తెలుపుతున్నారు.



రేపల్లె: కారుమూరు రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

కలెక్టర్లకు దిశానిర్దేశం

- పలు అంశాలపై సమీక్ష.. ఫలితాలపై చర్చ
- వ్యవసాయ, అనుబంధ రంగాలపై దృష్టి పెట్టాలి
- తొలిరోజు సదస్సులో కలెక్టర్లకు ముఖ్యమంత్రి సూచన
- ఆర్టీజీఎస్‌లో ప్రథమ స్థానం.. గుంటూరు కలెక్టర్‌కు అభినందనలు



సదస్సుకు హాజరైన బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి

(బాపట్ల-ఆంధ్రజ్యోతి)

మరింత బాధ్యతతో విధులు నిర్వహిస్తే ఫలితాలు బాగుంటాయి.. ఆయా రంగాల పురోగతిపై దృష్టి పెట్టాలి.. అని కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కలెక్టర్ల రెండో సదస్సు బుధవారం రాజధాని అమరావతి సచివాలయంలో ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరగనున్న ఈ సదస్సుకు గుంటూరు, పల్నాడు, బాపట్ల కలెక్టర్లు నాగలక్ష్మి, అరుణ్‌బాబు, వెంకటమురళిలు హాజరయ్యారు. ఈ క్రమంలో తొలి రోజు సదస్సులో మూడు జిల్లాలకు సంబంధించిన వివిధ అంశాలు, విభాగాల వారీగా ముఖ్యమంత్రి కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ ఆరు నెలల వ్యవధిలో సాధించిన ఫలితాలపైన, జిల్లా గణాంకాలను సదస్సులో ప్రస్తావించి వాటిపై సమగ్రంగా చర్చించారు.

ధాన్యం సేకరణపై దృష్టి సారించాలి

ధాన్యం సేకరణ పైనా దృష్టి పెట్టాలని సీఎం బాపట్ల కలెక్టర్‌కు సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో 28 శాతం మందికే నగదు జమ అవుతున్నట్లు, రవాణా, గోనె సంచుల విషయంలో 25శాతం మంది సమస్యలున్నాయని సర్వేలో తేలిందన్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం సేకరణపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలన్నారు. గ్రీవియన్స్ విషయంలో ఎక్కువగా వచ్చే వాటిల్లో బాపట్ల జిల్లా రెండోస్థానంలో ఉన్నది. జూన్ మొదలుకుని చూస్తే దాదాపుగా 700లకు ఫిర్యాదులు వచ్చాయి. 34.38 శాతం మంది ఫిర్యాదుల పరిష్కారం తీరుపై అసంతృప్తితో ఉన్నారు. వచ్చే కలెక్టర్ల సదస్సు నాటికి ప్రజల సంతృప్తి శాతం 100కు పెరగాలని సీఎం చెప్పారు. ఆయిల్ పామ్ విషయంలో 4శాతం మాత్రమే వృద్ధి సాధించి అట్టడుగున ఉన్నందున, ఈ అంశంలోనూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పశుకిసాన్ క్రెడిట్ కార్డుల జారీ లక్ష్యం 2,450 కాగా కేవలం 360 మందికి మాత్రమే ఇచ్చారన్నారు. ఎన్‌పీసీఐకి బ్యాంకు ఖాతా లింకు విషయంలో జిల్లా వ్యాప్తంగా 4,376 ఖాతాలు పెండింగ్‌లో ఉన్నాయని వాటి విషయంలో పురోగతి చూపించేలా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. గృహాల విషయంలో 14,988 ప్రోగ్రెస్ దశలో ఉన్నాయని వాటిపూర్తికి చర్యలు చేపట్టాలన్నారు. 28,013 మంది చిన్నారులకు ఆధార్ నమోదు విషయంలో పెండింగ్‌లో ఉందని ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించాలని ఆదేశించారు. 477 సచివాలయాల్లోని 1077 మంది వరకు హాజరు విషయంలో నిర్లక్ష్యంగా ఉంటున్నారన్నారు. గత వర్షాల సమయంలో కరకట్ట ప్రమాదకరంగా మారిందని కలెక్టర్ సదస్సులో తెలపగా కరకట్ట మరమ్మతులకు సీఎం సానుకూలంగా స్పందించారు. క్లస్టర్ల వ్యవస్థ లేకపోవడంతో కాల్వల పరిస్థితి అధ్వానంగా మారిందని చెప్పగా అవుట్‌సోర్సింగ్‌లో నియామకాలకు సీఎం అనుమతించినట్లు కలెక్టర్ తెలిపారు.

కృత్రిమ మేధ ద్వారా విస్తృత పరిశోధనలు



సావనీరు పుస్తకం ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ కళాశాలలో 'మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. ప్రారంభ సభకు ఇంచార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మారుతున్న ఆహార అలవాట్ల వల్ల కలిగే నష్టాలను వివరించారు. వాటిని ప్రజలకు తెలియపరచడంలో ఫార్మసిస్టులు కీలక పాత్ర పోషించాలని గుర్తు చేశారు. ముఖ్యవక్తగా పాల్గొన్న మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో ఉన్న మంగళయాటన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య కేఆర్ఎస్ సాంబశివరావు మాట్లాడుతూ జన్యు క్రమ లోపాల వల్ల కలిగే రుగ్మతలను ఆధునిక పద్ధతుల ద్వారా చికిత్స చేయవచ్చునని పేర్కొన్నారు. భారత ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఐ. బాలకృష్ణ మాట్లాడుతూ సాంకేతికత వల్ల కలుగుతున్న దుష్ప్రయోజనాలను వివరించారు. బెంగళూరులోని ఆల్ అమీన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎండీ సలాహుద్దీన్ డీప్ లెర్నింగ్ మిషన్, లెర్నింగ్ అల్గారిజమ్ ఉపయోగించి ఔషధ లక్ష్యాలను గుర్తించడం, దానికి అనుగుణంగా ఔషధాలను కనుగొనడంలో ఏఐ ముఖ్యమైన భాగంగా మారిందని పేర్కొన్నారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ డి.రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల అనుబంధ కళాశాలల నుంచి 800 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కేసీరెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్ కో స్పాన్సర్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. ప్రారంభ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.ప్రమీలారాణి అధ్యక్షత వహించారు. సదస్సులో రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, కో కన్వీనర్ డాక్టర్ అన్నపూర్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.సుజన, కోశాధికారి డాక్టర్ కేతు ప్రవల్లిక, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.మస్తానమ్మ, కె.విజయ్ కిషోర్, తెనాలిలోని ఏఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి రూ. 4 లక్షల కోట్ల పెట్టుబడులు

- ఈ ఘనత సీఎం చంద్రబాబుదే
- జగన్ పోరుబాటను ప్రజలు పట్టించుకోరు
- ప్రభుత్వ చీఫ్ విప్ ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ ఆంజనేయులు

వినుకొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి గత ఆర్నెలల్లో రూ. 4 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, రానున్న రోజుల్లో మరెన్నో పెట్టుబడులు రానున్నాయని, ఈ ఘనత సీఎం చంద్రబాబుదేనని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటైన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ పోరుబాటను ప్రజలు పట్టించుకునే పరిస్థితి లేదనీ, జరిగిన పొరపాట్లు సరిదిద్దుకుంటే రానున్న రోజుల్లో కనీసం ప్రతిపక్ష హోదా అయినా లభిస్తుందని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దోచుకొని అప్పులపాలు చేశారనీ, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆర్నెలల్లోనే గత ప్రభుత్వ అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా నారా చంద్రబాబు నాయుడు అడుగులు వేస్తున్నారని తెలిపారు. డిప్యూటి సీఎం పవన్ కల్యాణ్ సారధ్యంలో రూ. 4500 కోట్లతో 13 వేల గ్రామాల్లో 30 వేల అభివృద్ధి పనులు సంక్రాంతి నాటికి పూర్తి చేయబోతున్నామని వివరించారు. ఒకేసారి రూ.4 వేలు పింఛన్ పెంచిన ఘనత సీఎంకే దక్కిందన్నారు. రూ.15 వేల కోట్లతో రాజధాని అభివృద్ధి, రూ.12 వేల కోట్లతో పోలవరం అభివృద్ధికి నిధులు తెచ్చి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని, రాష్ట్రంలో 198 అన్న క్యాంటీన్ల ద్వారా నిరుపేదల ఆకలి తీరుస్తున్నామని, 50 లక్షల మందికి దీపం పథకం ద్వారా సిలిండర్లు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. గతంలో నాసిరకం మద్యంతో వేలాదిమంది ప్రాణాలు గాలిలో కలిశాయని, నేడు చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మద్యం పాలసీ ద్వారా అతితక్కువ ధరకే నాణ్యమైన మద్యం లభిస్తుందన్నారు. రాష్ట్రంలో 16 వేలకు పైగా నిరుద్యోగులకు డీఎస్సీ 6100 పోలీస్ ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా నేడు అడుగులు వేస్తుంటే జగన్‌మోహన్‌రెడ్డి ఓర్చుకోలేకపోతున్నారని విమర్శించారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మాజీ ఎంపీపీ అమృతపూడి కోటయ్య, ప్రముఖ న్యాయవాది, బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు పోట్లూరి సైదారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆయుబ్‌ఖాన్, పీవీ సురేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పదవి ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నాం..

కె.నాగబాబుకు మంత్రి పదవి ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. అదేవిధంగా ఆర్.కృష్ణయ్య, సాన సతీష్, బీద మస్తాన్‌కు రాజ్యసభ సీట్లు కేటాయించి గౌరవించడం అభినందనీయమని తెలిపారు.

టూరిజం అభివృద్ధికి సీఎం నూతన పాలసీ



సూర్యలంక తీరంను పరిశీలిస్తున్న చైర్మన్ బాలాజి

బాపట్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని టూరిజంను అభివృద్ధి చేసేందుకు నూతన పాలసీని ప్రవేశపెట్టారని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బాలాజి తెలిపారు. బుధవారం బాపట్ల సూర్యలంక సముద్ర తీరాన్ని స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ టూరిజం అంటే దేశంలోనే అగ్రగామి టూరిజంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి నూతన పాలసీని ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్రంలో టూరిజం ప్రదేశాలను పెంచటం ద్వారా ఎంతోమందికి ఉపాధి లభిస్తుందన్నారు. టూరిజం అభివృద్ధి వలన రాష్ట్ర ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. దీనిలో భాగంగానే సూర్యలంక తీరాన్ని పరిశీలించినట్లు తెలిపారు. సూర్యలంక తీరంలో అద్భుతమైన పరిస్థితులు ఉన్నాయనీ, చాలా పెద్దబీచ్ అని దీనిని మరికొంత అభివృద్ధి చేసుకుంటే పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో విశాఖబీచ్ తర్వాత బాపట్లబీచ్‌కి మంచి పేరు ఉందన్నారు. రాష్ట్రంలో కొన్ని ప్రాజెక్టులను తీసుకొని అభివృద్ధి చేసే విషయంలో గండికోట, అఖండగోదావరి సెంటర్‌లను తీసుకున్నప్పటికీ రెండో ఫేజ్‌లో బాపట్ల బీచ్‌ను కూడా తీసుకుని అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల రాజధానిలకు సూర్యలంకబీచ్ ఎంతో దగ్గరగా ఉందన్నారు. సూర్యలంక వద్ద ఉన్న స్టయిట్ రోడ్డు మీద కూడా షాపులను ఏర్పాటు చేయనున్నామనీ, తద్వారా షాపింగ్ చేసే పర్యాటకులకు నేరుగా బీచ్ కన్పిస్తుందన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో కాంస్య పతకం కైవశం



కాంస్య పతకం సాధించిన కోటేశ్వర్

తాడేపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లికి చెందిన సంధు కోటేశ్వర్ రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. కాకినాడలో నవంబరు 6 నుంచి 9 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అండర్ 11 విభాగంలో కృష్ణా జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి మూడు బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. కాగా డిసెంబరు 5 నుంచి జరుగుతున్న జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ కర్ణాటకలోని మైసూర్‌లో ఏపీ నుంచి అండర్ -11 విభాగంలో రింక్-2 (500+డి) పోటీల్లో ఉండవల్లికి చెందిన కోటేశ్వర్ కాంస్యపతకం సాధించి పలువురి మన్ననలు అందుకున్నారు.

వాగులో పడి యువకుడు మృతి



హరీష్ (ఫైల్)

కొత్తలూరు (శావల్యాపురం) డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గేదెలు మేపుకునేందుకు వెళ్లిన యువకుడు కాలు జారి వాగులో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్తలూరు గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దావులూరి ప్రసాదు కుమారుడు దావులూరి హరీష్(26) ప్రతిరోజూ గేదెలను మేపుకునేందుకు పొలానికి వెళ్తుంటాడు. అదే క్రమంలో బుధవారం ఉప్పరపాలెంకు వెళ్లే దారిలో అంగలేరు వాగు వైపున్న పొలాలకు గేదెలను తోలుకెళ్లాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో నీరు తాగేందుకు వాగులోకి దిగుతుండగా, కాలుజారి వాగులో పడిపోయాడు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో బయటకు రాలేక నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. చుట్టుపక్కల పొలాల్లో పనిచేస్తున్న రైతులు కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. స్థానికులు విషయాన్ని పోలీసులకు తెలియజేయగా రైటర్ సలీం బాషా సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపారు.

లండన్ టు అమరావతి పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న వర్సిటీ వీసీ ఆచార్య గంగాధరరావు, వర్సిటీ అధికారులు

పెదకాకాని, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఆంగ్ల విభాగంలో సీనియర్ ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ గుజ్జు చెన్నారెడ్డి రచించిన లండన్ టు అమరావతి నవలను బుధవారం ఇంఛార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ చెన్నారెడ్డి తన రచనల ద్వారా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ కీర్తిని విశ్వవ్యాప్తం చేస్తున్నారని అభినందించారు. ఇటువంటి రచనలు సమాజ సోపానాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. రచనల్లోని సాహిత్యం నేటి తరానికి ఎంతో దోహదపడుతుందని సూచించారు. పుస్తక పఠనంలో ఉన్న మక్కువ సాహిత్య రచనలో చూపినట్లయితే విలువైన సాహిత్య సంపద సృష్టించవచ్చునని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చెన్నారెడ్డి సాహిత్య రచనలు ఆహ్వానించ తగినవని పేర్కొంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంఛార్జి రెక్టార్ ఆచార్య కె.రత్న షీలామణి మాట్లాడుతూ బోధన, పరిశోధనలతోపాటు సాహిత్యం పట్ల చెన్నారెడ్డి చూపిస్తున్న మక్కువ ప్రశంసనీయమని కొనియాడారు. ఇంఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ప్రిన్సిపాల్స్ ఆచార్య సురేష్ కుమార్, ఆచార్య వీరయ్య, ఆచార్య జాన్సన్, ఆచార్య ప్రమీలారాణి మాట్లాడుతూ చెన్నారెడ్డి సాహిత్య రచన ఎంతో ఉన్నతంగా ఉంటుందని పేర్కొన్నారు. పుస్తక రచయిత ఆచార్య చెన్నారెడ్డి మాట్లాడుతూ తన లండన్ టు అమరావతి నవల నేపథ్యాన్ని వివరించారు. పుస్తక రచనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, రూస కోఆర్డినేటర్ ఆచార్య ఎస్.మురళీమోహన్, పూర్వ విద్యార్థుల సంఘం డైరెక్టర్ ఆచార్య జీవీఎస్ఆర్ ఆంజనేయులు, విదేశీ విద్యార్థుల విభాగం డైరెక్టర్ ఆచార్య పి .పద్మావతి, హెచ్ఆర్ఎం విభాగాధిపతి డాక్టర్ బి.నాగరాజు, జర్నలిజం ఇంఛార్జి కోఆర్డినేటర్ డాక్టర్ జె.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల పురపాలక సంఘం

స్వల్ప వ్యవధి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.516-2/2020/ఇ1 తేది : 10.12.2024

బాపట్ల పురపాలక సంఘమునకు సంబంధించిన అభివృద్ధి పనులను చేయుటకుగాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు విధానము ద్వారా అర్హత గల రిజిష్టరు కాంట్రాక్టరుదారుల నుండి టెండర్లు కోరబడుచున్నవి. ఇతర వివరములకు www.tender.apeprocurement.gov.in(procurement place) వద్ద చూడగలరు మరియు ఇతర వివరముల కొరకు కార్యాలయము పనిచేయు వేళలో సంబంధిత విభాగము నందు అడిగి తెలుసుకొనగలరు.

పనులు సంఖ్య - 2 అంచనా విలువ - రూ.43,34,862/-

1) టెండరు బిడ్‌లు ప్రారంభ తేది - 10-12-2024 ఉదయం 10.00 గంటలకు
2) టెండరు బిడ్‌లు వేయుటకు ఆఖరు తేది - 16-12-2024 మధ్యాహ్నం 3.00 గంటలకు
3) టెండరు బిడ్‌లు స్వీకరించు చివరి తేది - 16-12-2024 మధ్యాహ్నం 4.00 గంటలకు

సం/- కమీషనరు, బాపట్ల పురపాలక సంఘం

నీ భర్తను చంపకుంటే.. నిన్ను చంపేస్తా

- సైనెడ్ ఉపయోగించాలని భార్యపై ఒత్తిడి
- ఎలా చేయాలో చూపేందుకు బిక్షగాడి హత్య
- పలు దఫాలుగా ఆమె భర్తపై హత్యాయత్నాలు
- ఇవీ ఓ వైసీపీ నాయకుడి ఉన్మాద చర్యలు



నాటి మంత్రి తానేటి వనితతో నాగేశ్వరరావు(ఫైల్)

గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాను బెదిరించి లొంగదీసుకున్న మహిళతో ఆమె భర్తను హత్య చేయించేందుకు ఓ వైసీపీ నేత అమాయకుడైన ఓ బిక్షగాడిని హత్య చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెంకు చెందిన ఆ పార్టీ నేత దేవరకొండ నాగేశ్వరరావు అలియాస్ ఓంకార్ సాగించిన అకృత్యాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇతని అరాచకాలపై బాధిత కుటుంబం ఈ నెల 2న గుంటూరు జిల్లా ఎస్పీని ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. బాధితుల ఫిర్యాదుతో నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఓ కేసు, మహిళా పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదు చేశారు. ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన తర్వాత కేసులైతే నమోదు చేశారు గానీ ఇంతవరకు నిందితుడిని అదుపులోకి తీసుకోలేదు. ఇప్పటికీ కొందరు గుర్తుతెలియని వ్యక్తులు బాధిత కుటుంబం నిర్వహించే దుకాణం వద్ద, ఇంటి సమీపంలో రెక్కీ నిర్వహిస్తుండటంతో ఆ కుటుంబం హడలిపోతోంది. బాధిత మహిళ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిలకలూరిపేట రోడ్డులో మరమరాలబట్టీ దుకాణం నిర్వాహకురాలిని లొంగదీసుకునేందుకుగానూ నిందితుడు నాగేశ్వరరావు తన అనుచరులతో మూడు దఫాలు దొంగతనాలు చేయించాడు. బాధిత మహిళ నగరంపాలెం స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసులు కూడా నమోదు చేశారు. కానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

హత్య చేయించడానికి ఎన్నో ప్రయత్నాలు..

ఓ మహిళను లొంగదీసుకుని వారు ఏకాంతంగా ఉన్న సమయంలో తీసిన ఫొటోలు, వీడియోలను అడ్డుపెట్టుకొని ఆమెను బ్లాక్ మెయిల్ చేసి ఆమె ద్వారానే ఆమె భర్తను హత్య చేయించేందుకు ఆ వైసీపీ నేత కుట్ర పన్నాడు. ఇందుకు గానూ ఓ బిక్షగాడిని కడతేర్చాడు. భర్తను చంపకపోతే ఆమెను, ఆమె పిల్లల్ని చంపేస్తానంటూ బెదిరించాడు. ఎవరికి అనుమానం రాకుండా, చేతికి మట్టి అంటకుండా ఎలా చంపాలి అనేది ఆమెకు తెలియజెప్పడానికి ఏకంగా ఓ బిక్షగాడిని సైనెడ్ ఇచ్చి చంపేసినట్లు బాధిత మహిళ ఆరోపిస్తుంది. చిలకలూరిపేట వెళ్లే జాతీయ రహదారిపై కాటూరి మెడికల్ కళాశాల సమీపంలోని సర్వీసు రోడ్డులో ఓ బిక్షగాడు గోనె పట్టాలతో డేరా కట్టుకొని నివాసం ఉండేవాడు. దారిన వచ్చి పోయేవారు ఇచ్చే వాటితో కడుపు నింపుకునేవాడు. అయితే వైసీపీ నేత నాగేశ్వరరావు ఓ బంగారు షాపులో పనిచేసే వ్యక్తి వద్ద నుంచి సైనెడ్ తెప్పించి బిక్షగాడికి నీటిలో కలిపి తాగించాడు. దీంతో అతను చనిపోయాడు. ఈ మొత్తం వ్యవహారాన్ని తన సెల్ ఫోన్‌లో వీడియో తీసి ఆమెకు చూపించాడు. ఇదేవిధంగా ఆమె భర్తను చంపాలని ఆమెను బెదిరించాడు. దీంతో భయపడిన మహిళ తన భర్తకు ఆహారంలో సైనెడ్ కలిపింది. అయితే ఆ ఆహారం నోట్లో పెట్టుకోగానే వికారంగా ఉండడంతో భర్త దాన్ని ఊసేశాడు. దీంతో ఏ మాత్రం అనుమానం రాకుండా ఆమె వెంటనే ఆహార పదార్థాలను బయట పడేసింది. ఈ ప్రయత్నం విఫలం కావడంతో ఆ తర్వాత విజయవాడలో కుక్కలు పట్టుకునే వారి వద్ద నుంచి తీసుకొచ్చిన ఇంజక్షన్ ఆమెకు ఇచ్చి భర్త నిద్రపోయే సమయంలో చేయాలంటూ బెదిరించాడు. కాని ఆమె ఇంజక్షన్ చేయలేకపోయింది. భర్తతో ద్విచక్ర వాహనంపై వచ్చే సమయంలో నీ చేతిలో ఉన్న సంచి కింద పడేసుకుంటే దానికోసం బండి ఆపుతాడని, ఆ సమయంలో తాము వచ్చి అతనికి ఇంజక్షన్ గుచ్చి వెళ్తామని చెప్పాడు. ఆ విధంగా చేయాలని నాగేశ్వరావు ఒత్తిడి తెచ్చినా బాధిత మహిళ అంగీకరించలేదు. దీంతో హత్య చేయడానికి నాగేశ్వరావు తన అనుచరులతో స్వయంగా రంగంలోకి దిగాడు.

చంద్రబాబుపై కోడిగుడ్లతో దాడి

2011లో జరిగిన ఉప ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు వెంగళాయపాలెం వచ్చిన సందర్భంలో తన అనుచరులతో చంద్రబాబుపై కోడిగుడ్లతో దాడి చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులోనూ పాల్గొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

కబ్జాలు.. అరాచకాలు

దేవరకొండ నాగేశ్వరరావు వెంగళాయపాలెంలో వైసీపీ నాయకుడుగా చలామణి అవుతూ గ్రామంలో కబ్జాలు, దౌర్జన్యాలకు పాల్పడిన సందర్భాలు అనేకం ఉన్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో రోడ్డు పక్కన వాగు పోరంబోకులో అనుమతి లేకుండా ఇంటిని నిర్మించాడు. అందులో కొంతకాలం వైసీపీ కార్యాలయం నిర్వహించాడు. ఎన్ని నేరాలు చేసినప్పటికీ పోలీసులు మాత్రం కేసులు నమోదు చేయడంలేదు. ఆయన్ను పట్టుకునేందుకు కనీస ప్రయత్నం కూడా చేయడంలేదని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య

పెదకాకాని, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్‌రోడ్డులో యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు బుధవారం పెద్దకాకాని పోలీసులు తెలిపారు. ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల గ్రామానికి చెందిన దండ శ్రీనివాస్ రెడ్డి(24) బీటెక్ చదువుకొని ఖాళీగా ఉంటున్నాడు. వ్యక్తిగత కారణాల నేపథ్యంలో రింగ్‌రోడ్డులోని ఓ చెట్టుకు తాడుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఇన్నర్ రింగ్‌రోడ్డులోని ఓ లాడ్జిలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్లు బుధవారం పెదకాకాని పోలీసులు తెలిపారు. గుంటూరు నగరాలకు చెందిన వింత అక్కిరెడ్డి(54) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. ఈ నెల 8న ఇంటి నుంచి బయటకు వచ్చి ఇన్నర్ రింగ్‌రోడ్డులో లాడ్జిలో రూమ్ తీసుకున్నాడు. రెండు రోజుల నుంచి బయటికి రాకపోవడంతో లాడ్జి నిర్వాహకులు అనుమానం వచ్చి పెదకాకాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి రూమ్ తాళాలు తెరిచి చూడగా అక్కిరెడ్డి మృతి చెంది ఉన్నాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని పోలీసులు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	94,102,113
చికెన్ విత్ స్కిన్	182.00
చికెన్ స్కిన్ లెస్	192.00

బాపట్ల వార్తలు

బాపట్ల • వేమూరు • రేపల్లె

13న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా

బాపట్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో 13న స్కిల్ కళాశాల ధరివాద కొత్తపాలెంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఎల్ అండ్ టి ఫైనాన్స్, వరుణ్ మోటార్స్, రాయల్ మెరైన్, భాష్యం స్కూల్, ఫ్లెక్స్‌టెక్ సోల్యూషన్స్ కంపెనీలు హాజరవుతాయని 100కు పైగా ఖాళీలు ఉన్నాయని తెలిపారు. పది, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, డిప్లమా, బీఎస్సీ, ఎమ్మెస్సీ, ఎంబీఏ, పీజీ విభాగాల వరకు చదువుకున్న 18 నుంచి 30 సంవత్సరాల వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు వారి బయోడేటా, రెజ్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫొటోతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు.

శాస్త్రీయ సంగీతంతో పామరులనూ అలరించిన ఎంఎస్ సుబ్బలక్ష్మి

● సాహితీభారతి అధ్యక్షుడు రావూరి

బాపట్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఎంఎస్ సుబ్బులక్ష్మి శాస్త్రీయ సంగీతాన్ని పామరులకు కూడా అర్థమయ్యే రీతిలో గానం చేసి అందరినీ అలరించారని సాహితీభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. ఎంఎస్ సుబ్బులక్ష్మి 20వ వర్ధంతి సభలో బుధవారం సాహితీ భారతి కోశాధికారి ఆదంషఫి, ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు సంయుక్తంగా మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితిలో కూడా ఎంఎస్ సుబ్బులక్ష్మి తన గానామృతాన్ని వినిపించి ప్రపంచవ్యాప్తంగా భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపచేశారని, సుబ్బులక్ష్మి భారతరత్న, పద్మవిభూషణ్ వంటి బిరుదులతో సత్కరింపబడ్డారని తెలిపారు. అనంతరం రచయితలు బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కస్తూరి శ్రీనివాసరావు తదితరులు సుబ్బులక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

దేవినూతల గ్రామంలో పశు వైద్య శిబిరం

బాపట్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల విద్యార్థులు జాతీయ సేవ పథక ప్రత్యేక శిబిరంలో బుధవారం దేవినూతల గ్రామంలో పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పశు వైద్య నిపుణులు డాక్టర్ కె.విజయప్రకాష్ పశువులకు పలు వైద్య పరీక్షలు చేసి పాడి రైతులకు ఉచితంగా మందులను అందజేశారు. అదేవిధంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ సీహెచ్ కోటేశ్వరరావు, కళాశాల సిబ్బంది డాక్టర్ వై.ఫణేంద్రకుమార్, ఎం.ఎల్.లావణ్య, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై దాడులు సరికాదు : యూటీఎఫ్

బాపట్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో పరిస్థితులు గతితప్పి తరుచుగా ఉపాధ్యాయులపై దాడులు పెరిగిపోతున్నాయి. ఈ పరిస్థితులను తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జడా వినయ్‌కుమార్, అడుగుల శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఒక పక్క విధుల నిర్వహణలో ఒత్తిడితో సతమతమౌతుంటే మరో పక్క రకరకాల కారణాలతో దాడులు జరగటం ఉపాధ్యాయులు భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. ఆవేశంలో తల్లిదండ్రులు విచక్షణ కోల్పోకూడదన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులు తమ వద్ద విద్య నేర్చుకునేందుకు వచ్చే వారి పట్ల తగు జాగ్రత్తతో ఉండి పిల్లల వల్ల ఏమైనా ఇబ్బందులు ఉంటే ప్రధానోపాధ్యాయులకు, వారి తల్లిదండ్రులకు విషయాలను తెలియజేయాలన్నారు.

14న ఉమ్మడి గుంటూరు జిల్లా జూనియర్స్ కబడ్డీ సెలక్షన్స్

బాపట్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరుజిల్లా 50వ జూనియర్స్ సెలక్షన్స్ నరసరావుపేటలోని వాగ్దేవి జూనియర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 14న ఉదయం 9 గంటలకు జరుగుతాయని జిల్లా కబడ్డీ కార్యదర్శి మంతెన సుబ్బరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సెలక్షన్‌కు వచ్చే ప్రతి ఒక్కరూ వారి ఆధార్‌కార్డు తీసుకురావాలని కోరారు.

ఉచిత ఆధార్ నమోదు క్యాంపు

చెరుకుపల్లి,డిసెంబరు 11(ఆంధ్ర జ్యోతి) : మండలంలోని చెరుకుపల్లి వెలుగు కార్యాలయంలో డిసెంబరు 12వ తేదీ నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలకు ఆధార్ నమోదు క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. ఈ క్యాంపునకు తల్లిదండ్రులు తమ ఒరిజినల్ ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు పిల్లలను కూడా తీసుకుని రావాలని కోరారు. మండలంలోని 5 సంవత్సరాల లోపు పిల్లలందరికి నమోదు అయ్యే వరకు ఈ క్యాంపు నిర్వహిస్తామని తెలిపారు. ఆధార్ నమోదుకు ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవలసిందిగా కోరారు.

నేర ప్రదేశాలను పరిశీలించిన డీఎస్పీ బృందం

కొల్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మైనర్ బాలికపై అత్యాచారం జరిగిన ప్రదేశాలను డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికపై ఇరువురు యువకులు అత్యాచారం చేసిన సంఘటనపై దర్యాప్తులో భాగంగా నేర ప్రదేశాలను డీఎస్పీ, సీఐ వీరాంజనేయులు, ఎస్ఐ ఏడుకొండలు, రెవెన్యూ సిబ్బందితో ఆయా ప్రదేశాలను పరిశీలన చేశారు.

ఆయా ప్రదేశాలను బాధితురాలు డీఎస్పీ శ్రీనివాసరావుకి చూపించి ఘటన వివరాలను పేర్కొనగా, పోలీసు, రెవెన్యూ సిబ్బంది ఆయా వివరాలను నమోదు చేసుకున్నారు. పరారీలో ఉన్న నిందితులను త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు.

ఉన్నత పాఠశాలలో తాగునీటి కరువు

● పని చేయని ఆర్వో ప్లాంటు
● ఆకతాయిలు ధ్వంసం చేసిన ట్యాంకు
● రోజూ మినరల్ వాటర్ కొనుగోలు


వేమూరు హైస్కూల్‌లో ఆకతాయిలు ధ్వంసం చేసిన వాటర్ ట్యాంకు


వేమూరు హైస్కూల్‌లో పని చేయని ఆర్వో ప్లాంట్లు

వేమూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తాగునీటి కరువు వెంటాడుతూనే ఉంది. గతంలో గ్రామ పంచాయతీ ద్వారా పాఠశాల విద్యార్థులకు తాగునీటిని సరఫరా చేసేవారు. ఇందుకోసం వాటర్ ట్యాంక్‌కు నీటిని సరఫరా చేసే పైపులను ఆకతాయిలు ధ్వంసం చేశారు. నాబార్డు ద్వారా గతంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ దెబ్బతింది. గత ప్రభుత్వంలో ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశారు. అది కొద్ది కాలం మాత్రమే పని చేసింది. ప్రస్తుతం తాగునీటి సౌకర్యంలేని కారణంగా దాదాపు 250 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజు పాఠశాల అభివృద్ధి కమిటీ నిధుల ద్వారా బయట నుంచి పది మినరల్ వాటర్ బాటిల్స్ కొనుగోలు చేస్తున్నారు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించే సమయంలో అధికంగా వాటర్ బాటిల్స్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. వివిధ అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం ఖర్చు చేయాల్సిన నిధులు, ఈ పాఠశాల్లో దాదాపుగా తాగునీటి కోసం ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వంలో దెబ్బతిన్న ఆర్వో ప్లాంటు మరమ్మతులు నిమిత్తం అధికారులకు ఉపాధ్యాయులు తెలియజేసినా స్పందన లేదు. పంచాయతీరాజ్ శాఖ కూడా తాగునీటి సౌకర్యాన్ని కల్పించకుండా స్తబ్దత పాటిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.


విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ క్యాన్

సభ్యత్వ సేకరణపై పార్టీ శ్రేణులు దృష్టి పెట్టాలి

● ఎమ్మెల్యే ఆనందబాబు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి గ్రామాల్లో టీడీపీ సభ్యత్వాన్ని పెంచేందుకు పార్టీ శ్రేణులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి టీడీపీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. బాపట్ల పార్లమెంటరీ స్థాయి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో ఓటర్ల సంఖ్యను బట్టి 40 శాతానికి పైగా పార్టీ సభ్యత్వాలను సేకరించాలన్నారు. గ్రామాల వారీగా ఇంతవరకు సేకరించిన సభ్యత్వ నమోదు వివరాలను పరిశీలించారు. ఆయా గ్రామాలకు చెందిన నాయకులు అలసత్వం వీడి సభ్యత్వాలను సేకరించాలన్నారు.

నీటి సంఘాల ఎన్నికలు ఈనెల 14న జరగనున్నాయని, రైతు విధానంలో ఎంతో ముఖ్యమైన ఎన్నికలుగా వీటిని రైతులు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. మండలంలోని ఏడు నీటి సంఘాల ఎన్నికలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులును ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. విజయబాబు మాట్లాడుతూ, మండలంలోని ఏడు సంఘాలను ఏకగ్రీవంగా ఎన్నుకునే దిశలో సభ్యులందరం నిర్ణయానికి వస్తే బాగుంటుందన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు దండే వెంకటసుబ్బారావు, టీడీపీ రాష్ట్ర మైనారిటీ విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ హనీఫ్, బాపట్ల జిల్లా తెలుగు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి కిషోర్‌బాబు, పలు గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవు...

ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు హెచ్చరించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కొందరు రైతులు మిల్లర్లు ధాన్యం తోలుకునే విషయంలో తమను ఇబ్బంది పెడుతున్నారని అభియోగించారు. స్పందించిన ఆయన మిల్లర్లు చీటింగ్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటామని, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. దళారులు, మిల్లర్లు కలిసి రైతులను ఇబ్బందులు పెడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌తో చర్చించి కఠిన చర్యలు తీసుకుని రైతులకు అండగా ఉంటామన్నారు.

యాజలి రెవెన్యూ సదస్సులో 21 అర్జీలు : తహసీల్దార్

కర్లపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యాజలి గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతులు 21 సమస్యలపై అర్జీలు అందజేశారని తహసీల్దార్ సుందరమ్మ తెలిపారు. యాజలి సచివాలయం వద్ద తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది పలుశాఖల అధికారులతో కలిసి రెవెన్యూ సదస్సులు నిర్వహించగా గ్రామానికి చెందిన ఒక రైతు తమ పొలాన్ని సర్వే చేసేందుకు దరఖాస్తు చేసుకోగా 20 మంది భూ సమస్యలపై తహసీల్దార్‌కు దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆద్దూరి శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి, ఆర్ఐ రాజేంద్ర, వీఆర్వో సుభానీ, సర్పంచ్ భానుప్రతాప్, కార్యదర్శి వీరాస్వామిరెడ్డి, ఎంపీటీసీ ఏపూరి నవనీతం, దేవదాయశాఖ ఈవో తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాలలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను రైతులు ఉపయోగించుకోవాలని తహసీల్దార్ సుందరమ్మ కోరారు. గురువారం ఉదయం బోలాయపాలెంలో, సాయంత్రం నాగరాజుపాలెంలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని, ఆయా గ్రామాల రైతులు రెవెన్యూ సమస్యలు ఏమైనా ఉన్నట్లైతే అర్జీలు అందజేయాలని తహసీల్దార్ కోరారు.


యాజలి రెవెన్యూ సదస్సులో రైతులు నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ సుందరమ్మ

ఖాజీపాలెంలో....

పిట్టలవానిపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాజీపాలెం గ్రామ సచివాలయంలో తహసీల్దార్ పి.మెహర్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సదస్సులో పట్టాదారు పాస్ పుస్తకాలు, భూసమస్యలు, రేషన్‌కార్డులు అనేక అంశాలపై అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మండల వ్యవసాయశాఖాధికారి సీహెచ్ సత్యానంద్, ఆర్ఐ శ్రీనివాసరావు, సర్వేయర్ ఆది రామచంద్రరావు, వీఆర్వోలు వీఆర్ఏలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నం సతీష్ జన్మదిన వేడుకలు

బాపట్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ 50వ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. అభిమానులు గజమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలిపారు. అనంతరం అభిమానులు అంబేద్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేశారు.


మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్‌ను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

● కర్లపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ జన్మదిన వేడుకలలో కర్లపాలెం మండలం నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండలంలోని 20 పంచాయతీల నుంచి పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులు, శ్రేయోభిలాషులు, ప్రజలు అధిక సంఖ్యలో బాపట్లకు తరలివెళ్ళి సతీష్ ప్రభాకర్‌కు బొకెలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించుకోవాలి

కొల్లిపర, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి లక్ష్మీసుధ అన్నారు. మండల పరిధిలోని వల్లభాపురంలో బుధవారం వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ లక్ష్మీసుధ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నీటిని అధికంగా తీసుకోవడం మంచిదన్నారు. నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తీసుకోకూడదన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహా మేరకు మందులు వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సరళ, ఏఎన్ఎం జ్యోతి, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ మల్లేశ్వరరావు, ఆశా కార్యకర్తలు కృష్ణకుమారి, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

ఈ బెడద ఎప్పటికి తీరేనో!



చెరుకుపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లిలోని ప్రధాన రహదారిపై మరల పందులు, గాడిదలను యధేచ్ఛగా వదిలివేయడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. గతంలో అధికారులు పందులు, గాడిదలు పెంపకందార్లకు గట్టి హెచ్చరికలు జారీ చేయడంతో కొన్నాళ్ళపాటు వాటిని రోడ్ల మీదకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో వాటిని మరలా రోడ్లపైకి వదిలారు. అధికారులు ఆయా పెంపకందార్లను హెచ్చరించి వాటిని రోడ్లమీదకు రానివ్వకుండా చూడాలని ప్రజలు కోరుచున్నారు.


చెరుకుపల్లి మెయిన్ రోడ్డులో సంచరిస్తున్న పందులు, గాడిదలు

కుచ్చెళ్లపాడులో గీతా జయంతి

వేమూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుచ్చెళ్లపాడు గ్రామంలో బుధవారం తిరుమల తిరుపతి దేవస్థానాల దాస సాహిత్య ప్రాజెక్టు భజన సమాజాల వారు గీతా జయంతిని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. రామాలయంలో విశేష పూజలు జరిపించి భగవద్గీత శ్లోకాలను ఆలపించారు. అనంతరం గోవింద నామస్మరణ, లలిత విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ, హనుమాన్ చాలీసా పారాయణ జరిపారు.


కుచ్చెళ్లపాడులో గీతా శ్లోకాల పారాయణ నిర్వహిస్తున్న దాస సాహిత్య ప్రాజెక్టు భజన సమాజం సభ్యులు

● భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గీతా జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని సూరేపల్లి అభయాంజనేయ స్వామి, రామాలయంలో గీతా జయంతి పురస్కరించుకుని భగవద్గీత పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రివేళ సామూహిక హారతులు ఇచ్చారు. కృష్ణ పరమాత్మ బోధించిన భగవద్గీత సారాంశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని, విశ్వ మానవ క్షేమాన్ని, శాంతి కపోతానికి భగవద్గీత కారణభూతం అవుతుందని జిల్లా ప్రచారక్ జంజనం హేమశంకరరావు తెలిపారు. కార్యక్రమంలో పొన్నపల్లి సత్యనారాయణ, పడమట వెంకటేశ్వరరావు, వేల్పూరి శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి, అరుణకుమారి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించిన ఎంపీడీవో


చిన్నారుల పలకపై అక్షరాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

కర్లపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతాయపాలెం పంచాయతీ పరిధిలోని తూర్పుపాలెం, యాదవపాలెం, ఎస్సీ, ఎస్టీ కాలనీలలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. అంగన్‌వాడీ సెంటర్‌లో చదువుతున్న 0 నుంచి 6 సంవత్సరాలలోపు విద్యార్థులకు ఆధార్ చేయించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. చిన్నారులు పలకలపై రాసిన అక్షరాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. రైతుభరోసా కేంద్రం, హెల్త్‌వెల్‌నెస్ సెంటర్, సచివాలయాలను సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పెదమల్లు రుణుకాదేవి, పెదమల్లు రాజ్యలక్ష్మి, పద్మావతి పాల్గొన్నారు.


వేమూరు పోలింగ్ కేంద్రంలో నీటి సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తున్న అధికారులు

నీటి సంఘాల ఎన్నికలకు సమాయత్తం

● షెడ్యూల్ విడుదల చేసిన అధికారులు
● నియోజకవర్గంలో 76383 మంది ఓటర్లు

వేమూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14న నిర్వహించనున్న నీటి సంఘాల ఎన్నికలకు అధికారులు సమాయత్తమయ్యారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను బుధవారం గ్రామాల్లో పబ్లిష్ చేశారు. నియోజకవర్గంలోని 5 మండలాల పరిధిలో 97498 ఎకరాల 67 సెంట్లు ఆయకట్టు భూమి ఉంది. ఇందుకు సంబంధించిన నీటి సంఘాల ఎన్నికలకు ఓటు హక్కు కలిగిన రైతులు 76383 మంది ఉన్నారు. వారిలో 49877 పురుషుల ఓట్లు, 26506 మహిళల ఓట్లు ఉన్నాయి. దామాషా ప్రకారంగా ప్రాదేశిక నియోజకవర్గాలను విభజించారు. నియోజకవర్గంలో 28 టీసీలను విభజించి చూపారు.

మండలాల వారీగా పరిశీలిస్తే...

వేమూరు మండలంలో 7 టీసీలు ఉండగా 24231 ఎకరాలు, 22,426 మంది ఓటర్లు ఉన్నారు. కొల్లూరు మండలంలోని 5 టీసీల పరిధిలో 13557 ఎకరాలుండగా 9605 మంది ఓటర్లు, భట్టిప్రోలు మండలంలో 4 టీసీల పరిధిలో 17387 ఎకరాలు ఉండగా 13418 మంది ఓటర్లు, అమృతలూరు మండలంలో 6 టీసీల పరిధిలో 23042 ఎకరాలకు చెందిన 18529 మంది ఓటర్లు ఉన్నారు. చుండూరు మండలంలోని 20260 ఎకరాలు పరిధిలో 11405 మంది రైతు ఓటర్లు ఉన్నారు.

● అమృతలూరు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 11 : సాగునీటి సంఘాల ఎన్నికకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసినట్టు నీటిపారుదల శాఖ ఏఈ దివ్యభారతి చెప్పారు. ఈనెల 14వ తేదీన నామినేషన్‌లు స్వీకరణ, పరిశీలన జరుగుతాయని అనంతరం ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

కొల్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అందజేశారు. గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో బుధవారం మండల పరిధిలోని చినపులివర్రు గ్రామానికి చెందిన వట్టికూటి హైమావతి, మండలపు ప్రణవిలకు సీఎంఆర్ఎఫ్ కార్యాలయం నుంచి వచ్చిన సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులకు అందించారు. అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొంది ప్రభుత్వ ఆర్థిక సహాయం కోసం ఎమ్మెల్యేను సంప్రదించగా ఆయన ముఖ్యమంత్రి సహాయనిధికి సిఫారసు చేశారు. హైమావతికి రూ.1,07,843లు, ప్రణవికి రూ. 22,300 ప్రభుత్వ ఆర్థిక సాయం అందింది. చెక్కులను అందుకున్న కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్యేకు తమ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్ ఉన్నారు.


ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ఆక్రమణదారులు భూములను ఖాళీ చేయాలి

● తహసీల్దార్ వెంకటేశ్వర్లు

కొల్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములను ఆక్రమించిన ఆక్రమణదారులు వెంటనే భూములను ఖాళీ చేయాలని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు ఆదేశాలు జారీ చేశారు. రావిలంకలో సొసైటీ పరిధిలో ఉన్న ఆర్‌సీ భూములు భూస్వాములు కొంత మంది ఆక్రమించి ఆయా భూముల్లో ఉన్న చెట్లను నరికి సాగు చేస్తున్నారని, లంక గ్రామాల్లోని సొసైటీ పెద్దలు, కలెక్టర్, ఎమ్మెల్యే, మండల స్థాయి అధికారులకు నెల రోజుల నుంచి వినతి పత్రాలు అందజేశారు. ఆయా ఫిర్యాదులపై స్పందించిన తహసీల్దార్ రావిలంక వెళ్లి ఆక్రమణకు గురైన భూములను పరిశీలించి ఆక్రమణదారులతో చర్చించారు. వెంటనే ఆయా భూములను ఖాళీ చేయకపోతే కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆక్రమణదారులు ఖాళీ చేయని పక్షంలో ట్రాక్టర్లతో ఆయా భూములను దున్నించాలని వీఆర్వోలకు తహసీల్దార్ సూచించారు. సొసైటీ పెద్దలు ఏడు గ్రామాల్లో ఉన్న పేదలకు సమానంగా ఆ భూములను పంపిణీ చేయాలని తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో తోకలవానిపాలెం సర్పంచ్, సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు టి.కృష్ణమోహన్, ఆ పార్టీ నాయకులు సురేష్, మరియరావు, సొసైటీ పెద్దలు కంచర్ల వెంకటేశ్వరరావు, సుదర్శనరావు, రామారావు, జ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.


రావిలంకలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

మండల సమాఖ్య కార్యాలయంలో సెమీ క్రిస్మస్

వేమూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం ఏపీఎం శోభన్‌బాబు అధ్యక్షతన సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కేక్ కట్ చేశారు. సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, యానిమేటర్లు, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన ఆనందబాబుకు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సచివాలయంలో సిబ్బందికి శిక్షణ పూర్తి

కొల్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై సచివాలయ సిబ్బందికి బుధవారం శిక్షణ పూర్తయ్యింది. స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో మంగళ, బుధవారాల్లో ఐక్యరాజ్య సమితి - భారత ప్రభుత్వం గ్రామాల్లో మెరుగైన జీవనోపాదులు తదితర 10 అంశాలపై సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన రీసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.నరసింహారావు, ఈవోపీఆర్డీ సునీత పాల్గొని శిక్షణలో అంశాలను గ్రామాల్లో అమలు పరిచే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

స్కామర్ల చేతికి చిక్కి విలవిల?

- ఫోన్ హ్యాకింగ్‌లతో నగదు మాయం
- బంధాల బలహీనతలతో బెదిరింపులు
- పంజా విసురుతున్న సైబర్ నేరగాళ్లు



సైబర్ నేరగాళ్లు, స్కామర్ల బారినపడి ఆర్థికంగా నష్టపోవడం, మానసికంగా కుంగిపోవడం జరుగుతున్నాయి. ఆన్‌లైన్‌లో మోసపూరిత ప్రకటనలకు ఆకర్షితులై డబ్బు పోగొట్టుకున్న వాళ్లు, మోసపూరిత ఫోన్ కాల్స్ గురించి అవగాహన లేక తమ బ్యాంకు ఖాతాలు ఖాళీ చేయించుకున్న వాళ్ల సంఘటనలు తరచుగా వింటూనే ఉంటాం. సైబర్ నేరగాళ్ల బారి నపడే బాధితుల సంఖ్య రోజురోజు కూ పెరుగుతూనే ఉంది. ఈ తరహా మోసాలకు గురైన వారిలో ఉపాధ్యాయులు, వ్యాపారులు, సామాన్యులు.. ఇలా వివిధ రంగాలకు చెందిన వారు ఉన్నారు.



పొన్నూరుటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు ఆన్‌లైన్ మోసాలు, మరోవైపు ఫోన్ హ్యాకింగ్‌లు. వీటి బారినపడి ఆర్థికంగా, మానసికంగా దెబ్బ తింటున్న వారి సంఘటనల గురించి తరచుగా వింటూనే ఉన్నాం. సైబర్ నేరగాళ్లు, స్కామర్ల ఆఫర్లకు ఆకర్షితులై ఆర్థికంగా నష్టపోతున్నారు. మీ కుమారుడో, కుమార్తె కేసుల్లో చిక్కుకున్నారని వారు అరెస్టు కాకుండా తప్పించుకోవాలంటే డబ్బు చెల్లించాలంటూ ఏ మాత్రం అనుమానం రాకుండా మాట్లాడుతూ, కుటుంబ సంబంధాల బలహీనతలను అడ్డుపెట్టుకొని ఆన్‌లైన్‌లో నగదు బదిలీ చేయించుకుంటూ నేరాలకు పాల్పడుతున్నారు. ఆ ఫోన్‌కాల్స్ మోసపూరితమని తెలిసినా బాధితులు తలలు పట్టుకుంటున్నారు. ఈ తరహా ఘటనల్లో మోసపోయిన వ్యక్తుల్లో ఎక్కువ శాతం మంది ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావట్లేదు. నామోషీగా భావించో, పోలీస్ కేసు పెట్టినా తిరిగి తమ నగదు తమకు రాదేమోననే ఆలోచనతోనో వారు మిన్నకుండిపోతున్నారు.

సైబర్ క్రైమ్‌లు....

దేశంలో సాంకేతిక విప్లవం రావటంతో కంప్యూటర్ కే పరిమితమైన సాంకేతిక అరచేతిలో ఇమిడిపోయే సెల్‌ఫోన్‌లకు చేరింది. సాంకేతికతను వినియోగించుకోవడంతో మంచి జరుగుతుందనే భావించే ప్రజలు, సైబర్ నేరగాళ్ల, స్కామర్ల చేతికి చిక్కి విలవిలాడే పరిస్థితులు. ప్రభుత్వాలు, పోలీసులు సైబర్ నేరాలపై ఎంత ప్రచారం చేసినా నేటికి సైబర్ నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టడం లేదు. నేరగాళ్ల ఆఫర్ల ఉచ్చుకు చిక్కి సామాన్యులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

పంజా విసురుతున్న నేరగాళ్లు....

ప్రారంభంలో కంప్యూటర్లలోకి మాల్‌వేర్ చొప్పించి కంప్యూటర్‌లోని భద్రపరిచిన ఫైల్స్‌ను నిర్వీర్యం చేసిన సైబర్ నేరగాళ్లు క్రమంగా తమ ప్రాబల్యం పెంచకుంటున్నారు. సెల్‌ఫోన్‌లోని వ్యక్తిగత విలువైన డేటాను హ్యాకింగ్ ద్వారా చోరీ చేసి బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్నారు. నెట్ బ్యాంకింగ్ ద్వారా నగదు లావాదేవీలు వినియోగించేలా యాప్‌లు అందుబాటులోకి రావడంతో స్కామర్లు మరింతగా విజృంభిస్తున్నారు. నగదు బదిలీల సమయంలో అమాయికులను లక్ష్యంగా చేసుకుని వన్‌టైం పాస్‌వర్డ్‌లు దొంగిలించి నగదును ఖాతాదారులకు తెలియకుండా తమ ఖాతాల్లోకి మళ్లించుకుంటున్నారు. సాంకేతికత మరింత అందుబాటులోకి రావడంతో సైబర్ నేరగాళ్లు మరో ముందుడుగు వేసి, దేశం వెలుపల ఉండే సైబర్ నేరగాళ్ల వ్యక్తిగత వివరాలను అడ్డు పెట్టుకొని మోసాలు కొనసాగిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల కట్టడికి సరైన వ్యవస్థ లేకపోవడంతో వీరి నేరాలు కొనసాగుతున్నాయి. డార్క్ వైబ్ సైట్‌లో అందుబాటులో ఉండే సాంకేతికతను అడ్డంపెట్టుకుని యథేచ్ఛగా ఆన్‌లైన్ నేరాల దందా సాగిస్తున్నారు.

స్కామర్ల నేరాలు..

పొన్నూరు పట్టణానికి చెందిన భార్యాభర్తలు ఇద్దరూ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. భర్త నెలూరు జిల్లాకు బదిలిపై వెళ్లారు. పోలీస్‌స్టేషన్ నుంచి ఫోన్ చేస్తున్నట్లుగా ఆయనకు ఇటీవల సెల్‌ఫోన్ నుంచి కాల్ వచ్చింది. వీరి కుమారుడి వివరాలు వెల్లడించి 'మీ అబ్బాయి యాక్సిడెంట్ చేశాడు.. ఒక యువతి చావు బతుకుల మధ్య ఉంది. వెంటనే వైద్యం చేయించాలి. వెంటనే నగదు బదిలీ చేయాలి' అని చెప్పారు. తమ కుమారుడతో మాట్లాడించాలని సదరు వ్యక్తి కోరగా ఓ యువకుడు ఏడుపు స్వరం వినిపించారు. దీంతో, బెదిరిపోయిన సదరు వ్యక్తి ఫోన్‌లోనే రూ. 75 వేల నగదు బదిలీ చేశాడు. కేసు నుంచి తప్పించాలంటే మరో లక్ష చెల్లించాలని డిమాండ్ చేయడంతో ఆయనకు అనుమానం వచ్చింది. ఈ విషయమై విచారణ చేస్తే ఎటువంటి ప్రమాదం జరగలేదని, వారి కుమారుడు క్షేమంగా ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న ఆ తండ్రి మోసపోయినట్లు గుర్తించి లబోదిబోమంటున్నాడు.



బ్యాంక్ ఖాతా ఖాళీ..

పొన్నూరు మండలానికి చెందిన ఓ చిరు ఉద్యోగి వినియోగించే సెల్ ఫోన్‌కు ఒక ఆఫర్ మెసేజ్ వచ్చింది. దానికి ఆకర్షితుడైన ఆ ఉద్యోగి ఆ మెసేజ్‌ను డౌన్‌లోడు చేసుకున్నాడు. అంతే, అప్పటి నుంచి ఆ సెల్‌ఫోన్ హ్యాకింగ్‌కు గురైంది. సెల్ ఫోన్‌లో డేటా బదిలీ చేసుకోవడమే కాకుండా ఆ ఉద్యోగి బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ. 79 వేలు ఉత్తరాది రాష్ట్రానికి చెందిన వ్యక్తుల ఖాతాలోకి బదిలీ చేసేసుకున్నారు. బ్యాంక్ ఖాతా ఖాళీ కావడంతో దిక్కుతోచని ఆ ఉద్యోగి పోలీసులను ఆశ్రయించాడు.

ఇంతవరకూ నెట్ ఆన్ చేయలేదు

ఓ వ్యక్తికి సోషల్ మీడియాలోని ఓ ఖాతా నుంచి ఇటీవల ఫోన్‌కాల్ వచ్చింది. ఆ ఫోన్ కాల్‌కు సమాధానం చెప్పడంతో, ఒక మహిళ దిగంబరంగా కనిపించి ఆ వ్యక్తిని కూడా వివస్త్రడిగా మారమని కోరింది. దీంతో భయపడిన సదరు వ్యక్తి ఫోన్ కట్ చేసి నేటి వరకు నెట్ ఆన్ చేయలేదు. మరో ఘటనలో.. ఓ ప్రముఖ పత్రికా విలేకరికి ఇటీవల వాట్సప్ కాల్ వచ్చింది. కాలర్ ఐడీగా సీబీఐ అధికారిక చిహ్నం ఉండటంతోపాటు పోలీస్ ఆఫీసర్ యూనిఫారం ధరించిన వ్యక్తి ఫొటో ఉంది. దీంతో ఆ వ్యక్తి అవతలి వ్యక్తితో మాట్లాడాడు. ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి సదరు వ్యక్తి కుమార్తె వివరాలు వెల్లడించడంతో పాటు ఆమెపై కేసు నమోదైందని, వదిలిపెట్టాలంటే ఫోన్ ద్వారా నగదు చెల్లించాలని డిమాండ్ చేశాడు. దీంతో, ఆ వ్యక్తికి అనుమానం వచ్చి డిస్కనక్ట్ చేశాడు.

ఆకర్షణీయమైన రిటర్న్స్ ఇస్తాం

చేబ్రోలు మండలానికి చెందిన వ్యాపారవేత్తకు పెట్టుబడులు పెడితే ఆకర్షణీయమైన రిటర్న్స్ ఇస్తామని ఫోన్‌లో సందేశం వచ్చింది. ఇది నమ్మిన ఆ వ్యాపారవేత్త రూ. 35 లక్షలు వరకు ఫోన్‌లో బదిలీ చేశాడు. ఎంతకు రిటర్న్స్ రాకపోవడం, నగదు బదిలీ చేయించుకున్న వారు తమ ఫోన్లు ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి మోసపోయానని సదరు వ్యాపారవేత్త గ్రహించాడు. పోలీసులను ఆశ్రయించారు. అలాగే మరో మహిళలకు సైతం రూ. 40 లక్షల మేర స్కామర్లు మోసం చేసినట్లు సమాచారం.

సైబర్ నేరగాళ్లు స్కామర్లు విచ్చలవిడిగా వ్యవహరిస్తునప్పటికి వారికి అడ్డుకట్టు వేయలేక పోలీసులు తీవ్ర ఇబ్బందలు పడుతున్నారు. ఈ నేరాలకు పాల్పడుతున్న వారు స్థానికులు కాకపోవటం, ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారు కావడం, దేశం వెలుపల నివసిస్తూ ఉండటంతో ఈ తరహా కేసులు పరిష్కారం జటిలంగా మారుతున్నాయని పోలీసులు చెబుతున్నారు.

మిర్చియార్డు చైర్మన్.. మళ్లీ ఓసీకే

- ప్రతిపాదన సిద్ధం చేసిన మార్కెటింగ్ శాఖ
- కలెక్టర్ ఆమోదంతో త్వరలో గెజిట్ నోటిఫికేషన్



గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు(మిర్చియార్డు) పాలకవర్గం చైర్మన్ పీఠాన్ని మళ్లీ ఓసీకే రిజర్వు చేయాలని మార్కెటింగ్ శాఖ ప్రతిపాదించింది. ఏఎంసీల రిజర్వేషన్లను ఖరారు చేయాలని మార్కెటింగ్ కమిషనర్ నుంచి మెమో రావడంతో ఆ శాఖ జిల్లా అధికారులు వివిధ కమిటీలకు రిజర్వేషన్ల ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కలెక్టర్ ఆమోదంతో వాటిని గజిట్‌లో ప్రచురించాల్సి ఉన్నది. అయితే ప్రస్తుతం కలెక్టర్ నాగలక్ష్మి కలెక్టర్ల సదస్సు, రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమై ఉండటంతో ఈ వారంతం/వచ్చే వారం దీనిపై దృష్టి పెడతారని అధికారవర్గాలు తెలిపాయి. ఎప్పటిలానే మిర్చియార్డుని ఓసీ(జనరల్)కు రిజర్వు చేయాలని ప్రతిపాదించారు. దీంతో టీడీపీ కూటమిలో చైర్మన్ పదవిని ఆశిస్తున్న నాయకులు తమ వంతు ప్రయత్నాల్లో మునిగిపోయారు.

మిర్చియార్డుకు ప్రపంచ వ్యాప్తంగా పేరు, ప్రఖ్యాతలు ఉండటంతో సహజంగానే ఈ పదవికి ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. అలానే యార్డులో ఏటా రూ. 10 వేల కోట్లకు పైగా మిర్చి లావాదేవీలు జరుగుతుంటాయి. ఇది కూడా చైర్మన్ పదవికి పోటీ పెరగడానికి మరో కారణం. అధికార పార్టీలో ఎవరికైతే ఎమ్మెల్యే స్థాయి టిక్కెట్‌ని ఎన్నికల్లో ఇవ్వలేకపోయారో అలాంటి వారికి ఈ పదవిని ఇచ్చి సంతృప్తిపరుస్తుంటారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో లేళ్ల అప్పిరెడ్డి, టీడీపీ హయాంలో మన్నవ సుబ్బారావు, వెన్నా సాంబశివారెడ్డి, వైసీపీ పాలనలో చంద్రగిరి ఏసురత్నం, నిమ్మకాయల రాజనారాయణలకు మిర్చియార్డు చైర్మన్ పదవులను ఆయా పార్టీలు ఇచ్చాయి. వీరంతా ఏదో ఒక నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టిక్కెట్‌ని ఆశించిన వారే. కాగా ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నది. ఈ నేపథ్యంలో చైర్మన్ పదవిని టీడీపీ/జనసేన పార్టీల్లో ఎవరో ఒకరికి లభించే అవకాశం ఉన్నది. ఒకవేళ టీడీపీకి చైర్మన్ పదవి లభిస్తే వైస్‌చైర్మన్ పదవిని జనసేనకు ఇస్తారు. అదే జనసేనకు చైర్మన్ పదవి వస్తే మిగతా పాలకపక్షంలో టీడీపీకి ఎక్కువ పదవులు లభిస్తాయి. బీజేపీ నుంచి కూడో ఒకరిద్దరికి కమిటీలో చోటు కల్పించాల్సిన పరిస్థితి ఉన్నది. అయితే రిజర్వేషన్ ప్రక్రియ ఖరారు అయిన తర్వాతనే మూడు పార్టీల నాయకులు కూర్చుని ఒక నిర్ణయం తీసుకొంటారు.

50 శాతం పదవులు మహిళలకే

వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో 50శాతం పదవులు మహిళలకు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. దాంతో ఆ మేరకు మార్కెటింగ్ శాఖ అధికారులు కసరత్తు జరుపుతున్నారు. అలానే ఎస్‌సీలకు 15 శాతం, బీసీలకు 29 శాతం, ఎస్‌టీలకు 6 శాతం రిజర్వేషన్ ఉండేలా చూస్తున్నారు. కలెక్టర్ ఆమోదంతో గుంటూరు జిల్లాలోని ఎనిమిది మార్కెట్ కమిటీలు గుంటూరు, తాడికొండ, మంగళగిరి, దుగ్గిరాల, ప్రత్తిపాడు, తెనాలి, పొన్నూరు, ఫిరంగిపురంలకు రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ని ప్రకటించనున్నారు.



ఎయిమ్స్ రహదారికి సొబగులు

- 17న రానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మంగళగిరి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎయిమ్స్ ప్రథమ స్నాతకోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 17న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రానున్న సందర్భంగా ఎయిమ్స్‌కు వెళ్లే రెండు ప్రధాన రోడ్డు మార్గాలను అధికారులు సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మంగళగిరి నగరం వైపు నుంచి ఎయిమ్స్‌లోనికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను పూర్తిగా తొలగించారు. ఎయిమ్స్ గేటు వద్ద ఉన్న మట్టిరోడ్డు మార్గాన్ని యుద్ధప్రాతిపదికన బీటీ రోడ్డుగా మార్చివేశారు. ఈ మార్గంలో వెలగని విద్యుద్దీపాల స్థానే కొత్త బల్బులను అమర్చారు. ఇక 16వ నెంబరు జాతీయ రహదారి నుంచి ఎయిమ్స్‌లోకి వచ్చే ప్రధాన రహదారికి కొత్త సొబగులను అద్దేపనిలో పడ్డారు. వడ్డేశ్వరం వద్ద హైవే దిగువన ఉన్న అండర్‌పాస్‌తోపాటు దానికి ఇరువైపులా ఉన్న సర్వీసురోడ్లకు కొత్తగా బీటి లేయర్ వేశారు. ఇప్పటివరకు పట్టించుకోని ఆ మార్గంలోని సెంట్రల్ డివైడర్‌కు గ్రీనరీ హంగులను సమకూరుస్తున్నారు. రోడ్డుకు అటుఇటుగా ఉన్న పిచ్చి మొక్కలను గడ్డిని తొలగించివేస్తున్నారు. అంతేకాదు.. కనకదుర్గా వారధి మీద ఉన్న గుంతలను సైతం పూడ్చివేస్తున్నారు. మొత్తం మీద రాష్ట్రపతి రాకతో ఎయిమ్స్ కు వెళ్లే మార్గాలు సుందరంగా, సౌకర్యవంతంగా మారుతున్నాయి.

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు పెరగనున్న జనరల్ బోగీలు

గుంటూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే జంక్షన్ మీదగా రాకపోకలు సాగించే మూడు రైళ్లలో జనరల్ బోగీల సంఖ్యని దశలవారీగా పెంచాలని రైల్వే శాఖ నిర్ణయించింది. మొదటిదశలో నంబరు. 12706/12705 సికింద్రాబాద్ - గుంటూరు - సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుకు జనరల్ బోగీల సంఖ్యని పెంచనున్నారు. దాదాపుగా 4 జనరల్ బోగీలు పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. రెండోదశలో నంబరు. 12704/12703 సికింద్రాబాద్ - హౌరా - సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, నంబరు. 12755/12756 కాకినాడ పోర్టు - భావనగర్ - కాకినాడ పోర్టు వీక్లీ ఎక్స్‌ప్రెస్, నంబరు. 17211/17212 మచిలీపట్నం - యశ్వంత్‌పూర్ - మచిలీపట్నం కొండవీడు ఎక్స్‌ప్రెస్, నంబరు. 12733/12734 తిరుపతి - లింగంపల్లి - తిరుపతి నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లలో జనరల్ బోగీల సంఖ్య పెంచుతారు. వీటిల్లో మూడు చొప్పున జనరల్ బోగీలు పెరిగే అవకాశం ఉన్నది. దీనివలన సాదారణ ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

క్రీడలతో శారీరక దృఢత్వం.. మానసిక ఉల్లాసం

- పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవంలో ఎస్పీ సతీష్ కుమార్



క్రీడా జ్యోతి వెలిగిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ | కబడ్డీ పోటీల్లో పోలీస్ క్రీడాకారులు

గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆటలు, క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా వార్షిక పోలీస్ స్పోర్ట్స్ మీట్ పోటీలు-2024ను ప్రారంభించారు. జిల్లా పోలీస్ అధికారులతో కలసి ఆటలు, క్రీడల జెండాను ఎగురవేసి, క్రీడాజ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నిత్యం బందోబస్తు, శాంతిభద్రతల పరిరక్షణ, వీఐపీలు, వీవీఐపీల పర్యటన విధులు, నేరస్తుల అన్వేషణ, రోడ్డు ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు అంటూ ఎన్నో విధుల్లో నిమగ్నమై, హడావుడిగా ఉండే పోలీసులకు వారి మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడానికి స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విధులకు స్వల్ప విరామాన్ని ఇచ్చి వారి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే విధంగా వారిలోని క్రీడా ప్రతిభను వెలికితీసి, వారి సామర్థ్యాన్ని నిరూపించడానికి ఈ క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. క్రీడల్లోని క్రమశిక్షణ వ్యక్తులకు జవాబుదారీతనం, బాధ్యతను బోధిస్తుందన్నారు. టీమ్ స్పోర్ట్స్‌లో పాల్గొనడం నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తుందన్నారు. ఒకరినొకరు ప్రోత్సహించుకోవడం, ఉమ్మడి లక్ష్యాన్ని సాధించడానికి సమిష్టిగా వ్యూహరచన చేయడం ఈ క్రీడల వలన అలవరుచుకుంటారన్నారు. గుంటూరు జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ క్రీడలు, ఆటల పోటీలు ఈ నెల 13వ తేదీ వరకు జరగనున్నాయని, ఈ పోటీలలో 8 విభాగాల (6 పోలీస్ సబ్‌డివిజన్లు, ఒక ఏఆర్ విభాగం, ఒక - హెడ్ క్వార్టర్ విభాగం) నుండి సుమారు 150మంది క్రీడాకారులు ఆయా పోటీలకు హాజరయ్యారన్నారు. ఈ పోటీల్లో పరుగు పందాలు, కబడ్డీ, ఖోఖో, లాంగ్ జంప్, హైజంప్, షార్ట్‌పుట్, షటిల్, టెన్నిస్, టగ్ ఆఫ్ వార్ తదితర క్రీడలు, ఆటలకు సంబంధించి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రమణమూర్తి, సుప్రజ, హనుమంతు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రసవత్తరంగా చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు

- ఏకగ్రీవానికి సయోధ్య
- చాంబర్ గౌరవాధ్యక్ష పదవికి ఆంజనేయులు
- అధ్యక్ష బరిలో తెరపైకి మాజీ కార్పొరేటర్ యేల్చూరి పేరు

గుంటూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు సమీపించే కొద్ది వ్యవహారం రసవత్తరంగా మారుతోంది. ప్రతి ఏటా జరగాల్సిన ఎన్నికలు ఈ నెల 28న నిర్వహించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దీంతో పలువురు చాంబర్ సభ్యులు, టీడీపీకి చెందిన ఆర్యవైశ్య నాయకులు రంగంలోకి దిగారు. చాంబర్ ఎన్నికలు ఏకగ్రీవం చేసేలా చర్చలు చేస్తున్నారు. ఈ క్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష పదవికి కాకుండా గౌరవాధ్యక్షుడుగా ఆతుకూరి ఆంజనేయులు కొనసాగేలా ఒప్పించినట్లు సమాచారం. అధ్యక్ష స్థానంలో మాజీ కార్పొరేటర్ యేల్చూరి వెంకటేశ్వర్లు బరిలో నిలుస్తున్నట్లు తెలిసింది. కాగా ఇదే సమయంలో గత ఎన్నికల్లో పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమిపాలైన రంగా బాలకృష్ణ కూడా ఈ దఫా అధ్యక్ష పదవి కోసం విస్తృత ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆయన వ్యాపారవర్గాల నుంచి మద్దతు కూడగట్టే పనిలో ఉన్నారు. అయితే , ఎన్నికలు ఏకగ్రీవమయ్యేలా కొందరు ఆర్యవైశ్య నాయకులు రంగంలోకి దిగారు. 34 ఏళ్ళుగా ఏకగ్రీవంగా ఎన్నికవుతూ వస్తోన్న ఆతుకూరి ఆంజనేయులను ఈ దఫా చాంబర్ గౌరవాధ్యక్షుడుగా నిలిపి ఏకాభిప్రాయంతో మరొకరికి అధ్యక్ష పదవితో ఎన్నికలు ఏకగ్రీవం చేసేందుకు కొందరు ఆర్యవైశ్య నాయకులు సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేస్తున్నారు. బరిలో ఉన్న వారు వెనక్కి తగ్గుతారా లేదా అనేది వేచి చూడాలి.

13న జాబ్‌మేళా

గుంటూరు(విద్య),డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13న జాబ్‌మేళా నిర్వహిస్తునట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు బుధవారం ఒక ప్రటనలో తెలిపారు. తెనాలిలోని ఐటీఐ కళాశాల, నల్లపాడు పాలిటెక్నిక్ కళాశాలల్లో ఈ జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పది నుంచి పీజీ వరకు విద్యార్హత ఉన్న 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు ఉన్న యువతీయువకులు అర్హులని తెలిపారు. బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

రాజధాని రైతులకు ఈ-లాటరీ నేడు

తుళ్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి రైతులకు ప్రత్యామ్నాయంగా అప్పగించే ప్లాట్లకు ఈనెల 12న గురువారం 'ఈ-లాటరీ' నిర్వహిస్తున్నట్లు ఏపీ సీఆర్డీఏ కమిషనర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని ప్రధాన కార్యాలయంలో 'ఈ-లాటరీ' జరుగుతుందని తెలిపారు. అమరావతి ప్రాంతంలోని 14 గ్రామాల రైతులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా ప్లాట్లను కేటాయించనున్నట్టు తెలిపారు. నవులూరు 1, 2 కురగల్లు 1, 2 నిడమర్రు 1, 1 రాయపూడి 1, 2 లింగాయపాలెం, మల్కాపురం, నెక్కల్లు, శాఖమూరు, తుళ్లూరు 1, 2 వెలగపూడి, మందడం 1, 2 అనంతవరం, ఐనవోలు తదితర గ్రామాల్లో సంబంధిత రైతులు హాజరుకావాలని సూచించారు.



బుధవారం రాత్రి విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్న పల్నాడు జిల్లా చిలకలూరిపేట బైపాస్ రోడ్డు. వెయ్యి కోట్ల రూపాయల వ్యయంతో 16.4 కి.మీ. పొడవున నిర్మించిన దేశంలోనే మొట్టమొదటి ఈ మోడల్ బైపాస్ రోడ్డుపై గతవారం రాకపోకలు ప్రారంభమయ్యాయి. విద్యుత్ అవసరాల కోసం ఒక మెగావాట్ విద్యుత్ ప్లాంట్‌ను కూడా నేషనల్ హైవే సంస్థ రోడ్డు పక్కన ఏర్పాటుచేసింది.

- (ఆంధ్రజ్యోతి) చిలకలూరిపేట

రైలు ప్రయాణం.. నరకం



(5వ పేజీ తరువాయి)

మధ్యాహ్నం 3, 4 గంటలకు విజయవాడ చేరుతున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించవచ్చు. సికింద్రాబాద్-గుంటూరు ఇంటర్‌సిటీ కూడా ఈ వారంలో రెండురోజులు గంటన్నర ఆలస్యంగా నడిచింది. సూపర్‌ఫాస్ట్ రైళ్లు కూడా ప్రయాణికులకు నరకం చూపుతున్నాయి. నరసాపురం నుంచి వచ్చే రైళ్లు, కాకినాడ నుంచి ముంబై వెళ్లే లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ కూడా గుంటూరుకు గంటకుపైగా ఆలస్యంగా వస్తున్నాయి. విజయవాడ నుంచి జిల్లాలోని తెనాలి, నిడుబ్రోలు, బాపట్లను కలుపుతూ చీరాల, ఒంగోలు మీదగా వెళ్లే రైళ్లు చాలా ఆలస్యంగా వెళుతున్నాయి. వంద కి.మీ దూరం ఉన్న చీరాల- విజయవాడ ప్రయాణం సగటున 4 నుంచి 7 గంటల వరకూ సమయం పడుతోంది. ఈ రూటులో ఇప్పటికే అనేక పాసింజర్ రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది. ఉన్న రైళ్లను కూడా ఆలస్యంగా నడుపుతోంది. ఈ రూటులో నడిచే పాసింజర్ రైళ్లు ప్రతిరోజూ సగటున గంట నుంచి రెండు గంటలు ఆలస్యంగా నడుస్తున్నాయి. క్రిష్ణాఎక్స్‌ప్రెస్ కూడా గంటకు తక్కువ కాకుండా ఆలస్యంగా నడుస్తున్నది. విజయవాడ- గూడూరు పాసింజర్ పరిస్థితి అసలు చెప్పడానికే వీలు లేదు. ఈ రైలు విజయవాడకు చేరే వరకూ నమ్మకం లేని పరిస్థితి.

నాడు రైళ్లు రద్దు.. నేడు ఆలస్యం

2020లో కరోనా వంకతో జనతా కర్ఫ్యూ, లాక్‌డౌన్ పేరు చెప్పి రైల్వేశాఖ దేశవ్యాప్తంగా రైళ్లను అర్థాంతరంగా రద్దుచేసింది. ఆ తర్వాత రెండు నెలలకు రైళ్లను పునరుద్ధరిస్తున్నామని చెప్పినా సాధారణ ప్రయాణికులు ప్రయాణించే పాసింజర్ రైళ్లను మాత్రం పునరుద్ధరించలేదు. కేవలం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను మాత్రమే నడిపింది. ప్రయాణికుల నుంచి ఒత్తిడి పెరగడంతో స్పెషల్ రైళ్ల పేరుతో పాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్ చార్జీలతో తిరిగి తీసుకువచ్చింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టికెట్ ధరలు తగ్గించినా రైళ్లను మాత్రం స్పెషల్ రైళ్లుగానే నడుపుతోంది. రద్దయిన రైళ్లను మాత్రం తిరిగి పునరుద్ధరించలేదు. పైపెచ్చు అనేక గ్రామాల్లో స్టాపులను కూడా తొలగించేశారు. కాగా 2024 ఏడాది మొత్తం అభివృద్ధి పనుల పేరుతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో తిరిగే స్పెషల్ రైళ్లను, సింహాద్రి, గోల్కొండ వంటి సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా రైల్వే శాఖ నెలల తరబడి రద్దుచేసింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రత్యేకించి సీజన్ ప్రయాణికులైన ఉద్యోగులు, గుంటూరు, విజయవాడల్లో పనులకోసం వెళ్లే కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

నగిషీలకు ప్రాధాన్యం..

రెండు మూడేళ్లుగా రైల్వే శాఖ రైల్వే స్టేషన్ల ఆధునికీకరణపై దృష్టి సారించింది. వందల కోట్లు ఖర్చు చేసి రైల్వే స్టేషన్లను అత్యాధునికంగా తీర్చిదిద్దుతోంది. అందమైన చిత్రమాలికలు, విగ్రహాలు, నగిషీలతో చక్కగా తీర్చిదిద్దుతోంది. కానీ రైళ్ల గురించి పట్టించుకోవడంలేదు. రద్దు చేసిన రైళ్ల పునరుద్ధరణపై దృష్టి సారించడంలేదు. ప్రయాణికుల ఇబ్బందులు తొలగించేలా రైళ్లను ఏర్పాటు చేయడంలేదు. వందలకోట్లు ఖర్చు చేసి స్టేషన్లను అభివృద్ధి చేసే బదులు రైళ్లను పునరుద్ధరించి, ప్రయాణ నాణ్యతను పెంచవచ్చు కదా అంటూ ప్రయాణికులు వాపోతున్నారు.

పొమ్మనకుండానే పొగ..

రైల్వే శాఖకు సరుకు రవాణా రైళ్లే ప్రధాన ఆదాయ వనరుగా ఉంటోంది. ప్రయాణికుల రైళ్ల కంటే గూడ్స్ రైళ్లపై వచ్చే ఆదాయం ఎక్కువ కావడంతో పాసింజర్ రైళ్లు తగ్గించాలని గతం నుంచి ప్రభుత్వాలు భావిస్తూ వస్తున్నాయి. అయితే రైల్వే అనేది సేవా దృక్పథంతో ఏర్పాటు చేసింది కాబట్టి గత ప్రభుత్వాలు అంత ధైర్యం చేయలేకపోయాయి. అయితే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారంలో భిన్నంగా వ్యవహరిస్తోంది. రైళ్లను రద్దు చేయడం, ప్రయాణంలో అంతరాయాలు కల్పించడం ద్వారా ప్రయాణికులే దూరమయ్యేలా చేస్తోందని పలువురు విమర్శలు చేస్తున్నారు. రైల్వే శాఖ తీరు కూడా గత కొంతకాలంగా అలానే ఉంటోంది. ఇప్పటికైనా ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రైళ్లను పునరుద్ధరించి, సకాలంలో నడిపి సగటు ప్రయాణికుల విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో విజయమ్మ

పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీ

మేదరమెట్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బాపట్ల జిల్లా వైద్య అధికారి విజయమ్మ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని చిట్టిబాబు, సిబ్బందితో మాట్లాడారు. ఆసుపత్రిలో ఓపీ రిజిస్టర్‌ను పిశీలించారు. మందుల లభ్యత గురించి కనుక్కున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులతో సిబ్బంది మర్యాదగా మాట్లాడి సమస్యలు తెలుసుకుని మెరుగైన సేవలందించాలన్నారు. అనంతరం పాత బిల్డింగ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆమంచి సాయం

వేటపాలెం, చీరాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల పొట్టి సుబ్బయ్యపాలెం సమీపంలో నిర్మాణంలో ఉన్న విల్లాల వద్ద నిర్మాణ సామగ్రి రోడ్డుపై అడ్డుగా ఉండడంతో రోడ్డు ప్రమాదం జరిగింది. అందులో ఓ యువకుడు మృతి చెందగా, మరో యుకకునికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కల్యాణ్ కుటుంబానికి రూ.2లక్షలు, గాయపడిన మనోజ్ కుటుంబానికి రూ.50వేలు అందజేశారు. భవిష్యత్‌లో కూడా వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

వెంకయ్య ఆశ్రమంలో దుప్పట్ల పంపిణీ

మార్టూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వెంకయ్య ఆశ్రమంలో బుధవారం కావలి వన్‌టౌన్ సీఐ ఎండీ ఫిరోజ్ యువకులు పేదలకు దుప్పట్లను పంపిణీ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో గడ్డం మస్తానవలి, షేక్ రషీద్, కాలేషా, అబ్దుల్ కలాం పాల్గొన్నారు.

భూ సమస్యను పరిష్కరించండి

అగ్రహారం రైతుల విజ్ఞప్తి

సంతమాగులూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అగ్రహారం రైతుల భూ సమస్యను వెంటనే పరిష్కరించాలని అఖిల భారత రైతు సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు మొహిద్దీన్ బాషా, టీడీపీ రాష్ట్ర ముస్లిం మైనార్టీ కార్యదర్శి మోతాదు బాషా స్పెషల్ అధికారి రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. సంతమాగులూరు మండలంలోని కొమ్మలపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు సర్పంచ్ మోతాదు మహబూబ్బాబు జాని అధ్యక్షతన బుధవారం జరిగింది. తహసీల్దార్ రవిబాబు, స్పెషల్ అధికారి రమేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతు సంఘం నాయకులు అగ్రహారం ఈ నామ్ భూముల సమస్య తరాలుగా ఉందన్నారు. ఆ భూములకు హక్కు కల్పించి బ్యాంకుల ద్వారా రుణాలు పొందే విధంగా పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి వీఆర్వో కోటమ్మ, టీడీపీ నాయకులు దర్యావలి, కొమరవెల్లి లాల్లుడే, రైతులు పాల్గొన్నారు.

13న పర్చూరులో జాబ్ మేళా

పర్చూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 13న పర్చూరులోని భవనం అంజిరెడ్డి తులాబంధుల అర్జునయ్య జూనియర్ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, సీడప్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్ బుధవారం ప్రకటలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో యాక్సిస్ బ్యాంక్, యస్‌బీఐ క్రెడిట్ కార్డ్, జిప్సం ప్రవేట్ లిమిటెడ్, హెటిరో లాబ్స్, ఫ్లేక్స్ టెక్ సొల్యూషన్స్ వంటి కంపెనీలు హాజరుఅవుతారన్నారు. ఆయా కంపెనీలకు సంబంధించి 100కు పైగా ఖాళీలు ఉన్నాయని, విద్యార్హతను బట్టి వేతనం రూ.12వేల నుంచి రూ.20వేల వరకు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాని కోరారు. వివరాలకు 6302764962 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

సెరీ కల్చర్ సాగుతో లాభదాయకం

సంతమాగులూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రైతులు సెరీ కల్చర్ సాగు లాభదాయకమని ఉమ్మడి జిల్లా సెరీ కల్చర్ అధికారి పి.సుజయ్ కుమార్ తెలిపారు. మండలంలోని కొమ్మలపాడు రైతు సేవా కేంద్రంలో మల్బరీ సాగు విధానంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా సెరీ కల్చర్ అధికారి పి. సుజయ్ కుమార్ మాట్లాడుతూ మల్బరీ సాగుతో ఎకరానికి ఎక్కువ ఆదాయం వస్తుందని చెప్పారు. మల్బరీ సాగుపై మక్కువ చూపాలని, పట్టు పురుగుల పెంపకంలో షెడ్ నిర్మాణం, మల్బరీ తోటల పెంపకంపై అవగాహన, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలు గురించి ఆయన రైతులకు తెలిపారు. కొమ్మాలపాడులో దాదాపు ముప్పై ఎకరాలకు పైగా సెరీ కల్చర్ సాగవుతుందని అన్నారు. మల్బరీ సాగు ఎలా చేయాలో సైంటిస్ట్ ఇబ్రహీం బాషా ఛాయా చిత్రం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్‌వో శివ నాగిరెడ్డి, వీఏస్ ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

ఆంజనేయులు మృతికి నివాళి

అద్దంకిటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మున్సిపాలిటీలో పర్మినెంట్ కార్మికుడుగా పని చేస్తున్న బోజంకు ఆంజనేయులు (60) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. అంజనేయులు మృతదేహాన్ని బుధవారం అద్దంకి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, ఇతర సంఘాల నాయకులు సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యాక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆదాం, గాలి బీషా, యర్రమోతు సుబ్బారావు, చింతా ప్రసన్న , జ్యోతి వెంకట్రావు ఉన్నారు.

సింహ గర్జన సభను జయప్రదం చేయండి

అద్దంకిటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గుంటూరులో ఈ నెల 15వ తేదీన జరిగే హలో మాల చలో గుంటూరు మాలల సింహగర్జన సభకు తరలి వచ్చి సభను జయప్రదం చేయాలని మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ భవనం వద్ద సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అద్దంకి నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షుడు అంకం కిరణ్‌కుమార్, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రాజశేఖర్, శ్రీనివాసరావు, పూర్ణ, నారాయణరావు, రోశయ్య, శ్రీకృష్ణ, హనుమంతరావు పాల్గొన్నారు.

మోటార్ సైకిలిస్టును ఢీకొన్న ఎక్స్‌కవేటర్

అద్దంకి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మోటార్ సైకిల్‌ను ఎక్స్‌కవేటర్ ఢీకొనడంతో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న రాజరావుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మార్టూరు మండలం చిమ్మిరిబండకు చెందిన రాజారావు బుధవారం మధ్యాహ్నం చిమ్మిరిబండ నుంచి ముండ్లమూరు మండలం మారెళ్లకు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా, అద్దంకి పట్టణానికి సమీపంలోని కలవకూరు రోడ్డులో ఇటుక బట్టీల మలుపు వద్ద ఎక్స్‌కవేటర్ ఢీకొట్టింది. గాయపడిన రాజారావును 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు.

ప్రమాదవశాత్తు సొనలో పడి వ్యక్తి మృతి

వేటపాలెం, చీరాల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు సొనలో పడి ఓ వ్యక్తి మృతి చెందారు. ఈ ఘటన మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ రామానగర్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం మద్దకం రమేష్(38) చేనేత పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రాత్రి సమయంలో బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు సొన నీటిలో పడి మృతి చెందారు. అతనికి భార్యా, ఇద్దర పిల్లలు. ఈ మేరకు రమేష్ భార్య ఈశ్వరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మరమ్మతుల మాయ!

- అక్కడి మట్టితోనే తూతూ మంత్రంగా పనులు
- గంగవరం అర్‌అండ్‌బీ రహదారిలో కాంట్రాక్టర్ చేతివాటం



పక్కకాల్వలోని నల్ల మట్టితో నింపిన రోడ్డు

నల్లమట్టితో తూతూమంత్రంగా జరుగుతన్న మరమ్మతు పనులు

ఇంకొల్లు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో రోడ్ల అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో రహదారులు అధ్వానంగా మారాయి. కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రోడ్లను బాగు చేసేందుకు శ్రీకారం చుట్టింది. ముందుగా పెద్ద ఎత్తున రోడ్ల మరమ్మతులకు పూనుకుంది. అయితే మరమ్మతు పనుల్లో కాంట్రాక్టర్ల చేతివాటం కన్పిస్తోంది. పనుల్లో డొల్లతనం బయటపడుతోంది. పేరుకు మరమ్మతు పనులు చేసినా అవి తూతూమంత్రంగా జరగడంతో కొద్ది రోజులకే తిరిగి ఆ రోడ్డు యథాస్థితికి చేరుకుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంకొల్లు నుంచి ముప్పవరం ఆర్అండ్‌బీ రోడ్డులో అరికట్లవారిపాలెం దగ్గర నుంచి ఇంకొల్లు వరకు రోడ్డు మరమ్మతు పనులు జరుగుతున్నాయి. గంగవరం సమీపంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురై పెద్దఎత్తున రోడ్డు మార్జిన్ దెబ్బతిన్నది. దీనిని పటిష్టం చేసేందుకు గ్రావెల్ మట్టి వాడాల్సి ఉండగా కాంట్రాక్టరు అక్కడ కాల్వలో ఉన్న నల్ల మట్టితోనే చదును చేసి చేతులు దులుపుకున్నారు. ఇక్కడ జరిగే పనులు నాసిరకంగా ఉండడంతో పరిస్థితి మళ్లీ మొదటికే వస్తుందని గ్రామస్థులు అంటున్నారు. ఇప్పటికైనా రోడ్డు పనులపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

జగన్ సమావేశానికి ఇద్దరు డుమ్మా

- పర్చూరు వైసీపీ ఇన్‌చార్జికి ఉద్వాసన తప్పదా!
- ఆయన స్థానంలో మధుసూదనరెడ్డికి అవకాశం?

చీరాల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత జగన్‌రెడ్డి బుధవారం తన నివాసంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన తమ పార్టీ ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి దిశానిర్దేశం చేయడమే సమావేశ ముఖ్య ఉద్దేశం. అయితే అందులో ఉమ్మడి ప్రకాశంలో భాగంగా, బాపట్ల జిల్లాకు సంబంధించి అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు డుమ్మా కొట్టారు. ఆక్రమంలో పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జికి ఉద్వాసన తప్పదనే భావనను వ్యక్తపరిచినట్లు సమాచారం. ఈ క్రమంలో గాదె మధుసూదనరెడ్డిని నియమించే అవకాశం ఉందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, దాన్ని మనం అందిపుచ్చుకోవాలని చెప్పడమే ప్రధానంగా జగన్ ప్రస్తావించారు. సమావేశానికి చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ హాజరుకాగా, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలకు చెందిన పాణెం హనిమిరెడ్డి, యడం, బాలాజీ సమావేశానికి గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో జగన్ పర్చూరు నియోజకవర్గ విషయమై మాట్లాడుతూ అతనెక్కడో ఉంటూ, ఇక్కడేం చేస్తాడంటూ యడం బాలాజీ తీరును ప్రస్తావించినట్లు తెలిసింది. అందుకు సంబంధించి పర్చూరు మండలానికి చెందిన ముఖ్య నాయకుడు, బాలాజీకి అనుంగ అనుచరునిగా గత ఎన్నికల్లో కొనసాగిన నేత బాలాజీకి మద్దతుగా నాలుగు రోజుల్లో బాలాజీ వస్తారని చెప్పినట్లు తెలిసింది. అయితే అక్కడ నాలుగు రోజులు, ఇక్కడ నాలుగు రోజుల అంటే ఎలా? జనాలతో ఉండాలని చెప్పినట్లు తెలిసింది. ఆ క్రమంలో వైసీపీ పర్చూరు నియోజవకర్గ ఇన్‌చార్జిగా గాదె మధుసూదనరెడ్డి పేరు ఖరారు చేసే ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్లు ఆ పార్టీ శ్రేణుల్లో చర్చించుకుంటున్నారు. వాస్తవానికి గతంలోనే మధుసూదనరెడ్డిని నియమించాల్సి ఉంది. అయితే సామాజికవర్గాల కూర్పులో అద్దంకి, పర్చూరు ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందినవారవుతారనే కోణంలో ఆలోచించి జగన్ అప్పట్లో వెనకడుగు వేశారు. ఈ క్రమంలో పర్చూరు అంశంపై ప్రస్తావన జరిగే సమయంలో మార్టూరు మండలంలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఓ ముఖ్యనాయకుడు మాట్లాడుతూ సామాజిక వర్గాల సమతూకంలో నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని, అందుకు పొరుగు నియోజకవర్గ ఇన్‌చార్జి పేరును సూచించినట్లు సమాచారం. మొత్తమ్మీద గైర్హాజరు అయిన ఇన్‌చార్జిలకు ప్రతినిధులుగా వారి తరపువారు హాజరైమమ అనిపించారని, కొందరు ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు కూడా సమావేశానికి డుమ్మా కొట్టినట్లు సమాచారం.

కుంభాభిషేక విశిష్టతను తెలుసుకోవాలి

సనాతన ధర్మోపన్యాసకులు చాగంటి

వేటపాలెం/చీరాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కుంభాభిషేక విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి.. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదనే పరమార్థాన్ని తెలుసుకోవాలి.. అప్పుడే మానసిక వికాసంతో ఆధ్యాత్మిక భావన పెంపొందుతుందని సనాతన ధర్మోపన్యాసకులు, ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు ఉద్ఘాటించారు. మండల పరిధిలోని దేశాయిపేట నీలకంఠపురంలోని శ్రీ గంగా పీయూషాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి క్షేత్రంలో మహాకుంభాభిషేక మహోత్సవంలో భాగంగా బ్రహ్మశ్రీ చాగంటి హాజరై భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలను వినిపించారు. మృదు, శాంత, గంభీర స్వరంతో ఆయన గొంతుక నుంచి జాలువారిన ప్రవచనాలు ఆధ్యాత్మిక గుభాళింపులు పరిసర ప్రాంతాలను కమ్మేశాయి. ప్రతి ఒక్కరూ శివ నామస్మరణలో ఓలలాడారు. కుంభాభిషేకం విశిష్టతను వివరిస్తూ, శివతత్వాన్ని ఆయన బోధించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగ కుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



ప్రవచనం చేస్తున్న చాగంటి

శ్రీ హనుమత్ వైభవం

చీరాల ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలో శ్రీ హనుమత్ వైభవం పేరుతో చేపట్టిన కార్యక్రమానికి సనాతన ధర్మోపన్యాసకు లు చాగంటి కోటేశ్వరరా ప్రవచనాల కార్యక్రమం రెండో రోజు బుధవారం కొనసాగింది. హనుమంతుని ఉపాసనతో ఒనగూరే ప్రయోజనాలను వివరించారు.

రామాయణంలో హనుమంతుని పాత్రను సవివరంగా చెప్పారు. అప్పటి దృశ్యాలు కళ్ల ముందు మెదులుతున్నాయా అన్న రీతిలో చాగంటి ప్రవచనాలు సాగాయి.

రైలు ప్రయాణం.. నరకం

(5వ పేజీ తరువాయి)

మధ్యాహ్నం 3, 4 గంటలకు విజయవాడ చేరుతున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించవచ్చు. సికింద్రాబాద్- గుంటూరు ఇంటర్‌సిటీ కూడా ఈ వారంలో రెండురోజులు గంటన్నర ఆలస్యంగా నడిచింది. సూపర్‌ఫాస్ట్ రైళ్లు కూడా ప్రయాణికులకు నరకం చూపుతున్నాయి. నరసాపురం నుంచి వచ్చే రైళ్లు, కాకినాడ నుంచి ముంబై వెళ్లే లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ కూడా గుంటూరుకు గంటకుపైగా ఆలస్యంగా వస్తున్నాయి. విజయవాడ నుంచి జిల్లాలోని తెనాలి, నిడుబ్రోలు, బాపట్లను కలుపుతూ చీరాల, ఒంగోలు మీదగా వెళ్లే రైళ్లు చాలా ఆలస్యంగా వెళుతున్నాయి. వంద కి.మీ దూరం ఉన్న చీరాల- విజయవాడ ప్రయాణం సగటున 4 నుంచి 7 గంటల వరకూ సమయం పడుతోంది. ఈ రూటులో ఇప్పటికే అనేక పాసింజర్ రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది. ఉన్న రైళ్లను కూడా ఆలస్యంగా నడుపుతోంది. ఈ రూటులో నడిచే పాసింజర్ రైళ్లు ప్రతి రోజూ సగటున గంట నుంచి రెండు గంటలు ఆలస్యంగా నడుస్తున్నాయి. క్రిష్ణా ఎక్స్‌ప్రెస్ కూడా గంటకు తక్కువ కాకుండా ఆలస్యంగా నడుస్తున్నది. విజయవాడ-గూడూరు పాసింజర్ పరిస్థితి అసలు చెప్పడానికే వీలు లేదు. ఈ రైలు విజయవాడకు చేరే వరకూ నమ్మకం లేని పరిస్థితి.

నాడు రైళ్లు రద్దు.. నేడు ఆలస్యం

2020లో కరోనా వంకతో జనతా కర్ఫ్యూ, లాక్‌డౌన్ పేరు చెప్పి రైల్వే శాఖ దేశవ్యాప్తంగా రైళ్లను అర్థాంతరంగా రద్దు చేసింది. ఆ తర్వాత రెండు నెలలకు రైళ్లను పునరుద్ధరిస్తున్నామని చెప్పినా సాధారణ ప్రయాణికులు ప్రయాణించే పాసింజర్ రైళ్లను మాత్రం పునరుద్ధరించలేదు. కేవలం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను మాత్రమే నడిపింది. ప్రయాణికుల నుంచి ఒత్తిడి పెరగడంతో 'స్పెషల్ రైళ్ల' పేరుతో పాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్ చార్జీలతో తిరిగి తీసుకువచ్చింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టికెట్ ధరలు తగ్గించినా రైళ్లను మాత్రం 'స్పెషల్' రైళ్లుగానే నడుపుతోంది. రద్దయిన రైళ్లను మాత్రం తిరిగి పునరుద్ధరించలేదు. పైపెచ్చు అనేక గ్రామాల్లో స్టాపులను కూడా తొలగించేశారు. కాగా 2024 ఏడాది మొత్తం అభివృద్ధి పనుల పేరుతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో తిరిగే స్పెషల్ రైళ్లను, సింహాద్రి, గోల్కొండ వంటి సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా రైల్వే శాఖ నెలల తరబడి రద్దు చేసింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రత్యేకించి సీజన్ ప్రయాణికులైన ఉద్యోగులు, గుంటూరు, విజయవాడల్లో పనులకోసం వెళ్లే కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

నగిషీలకు ప్రాధాన్యం

రెండు మూడేళ్లుగా రైల్వే శాఖ రైల్వే స్టేషన్ల ఆధునీకీకరణపై దృష్టి సారించింది. వందల కోట్లు ఖర్చు చేసి రైల్వే స్టేషన్లను అత్యాధునికంగా తీర్చిదిద్దుతోంది. అందమైన చిత్రమాలికలు, విగ్రహాలు, నగిషీలతో చక్కగా తీర్చిదిద్దుతోంది. కానీ రైళ్ల గురించి పట్టించుకోవడంలేదు. రద్దు చేసిన రైళ్ల పునరుద్ధరణపై దృష్టి సారించడంలేదు. ప్రయాణికుల ఇబ్బందులు తొలగించేలా రైళ్లను ఏర్పాటు చేయడంలేదు. వందలకోట్లు ఖర్చు చేసి స్టేషన్లను అభివృద్ధి చేసే బదులు రైళ్లను పునరుద్ధరించి, ప్రయాణ నాణ్యతను పెంచవచ్చు కదా అంటూ ప్రయాణికులు వాపోతున్నారు.

పొమ్మనకుండానే పొగ

రైల్వే శాఖకు సరుకు రవాణా రైళ్లే ప్రధాన ఆదాయ వనరుగా ఉంటోంది. ప్రయాణికుల రైళ్ల కంటే గూడ్స్ రైళ్లపై వచ్చే ఆదాయం ఎక్కువ కావడంతో పాసింజర్ రైళ్లు తగ్గించాలని గతం నుంచి ప్రభుత్వాలు భావిస్తూ వస్తున్నాయి. అయితే రైల్వే అనేది సేవా దృక్పథంతో ఏర్పాటు చేసింది కాబట్టి గత ప్రభుత్వాలు అంత ధైర్యం చేయలేకపోయాయి. అయితే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారంలో భిన్నంగా వ్యవహరిస్తోంది. రైళ్లను రద్దు చేయడం, ప్రయాణంలో అంతరాయాలు కల్పించడం ద్వారా ప్రయాణికులే దూరమయ్యేలా చేస్తోందని పలువురు విమర్శలు చేస్తున్నారు. రైల్వే శాఖ తీరు కూడా గత కొంతకాలంగా అలానే ఉంటోంది. ఇప్పటికైనా ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రైళ్లను పునరుద్ధరించి, సకాలంలో నడిపి సగటు ప్రయాణికుల విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.

నీటిసంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

342 డబ్ల్యూయూఏలకు ఇచ్చిన అధికారులు

ఒంగోలు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు సాగునీటి సంఘాల ఎన్నికలు జరుగుతున్నాయి. మూడు సార్లు వాయిదాపడిన ఆ ఎన్నికల షెడ్యూల్ నాల్గవసారి ముడిపడింది. అందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేశారు. ఆయా నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు నియమితులైన ఎన్నికల అధికారులు వాటిని సంబంధిత ప్రాంతాల్లో ప్రకటించారు. జిల్లాలో మొత్తం 342 డబ్ల్యూయూఏలు ఉండగా వాటి పరిధిలో సుమారు 2.10 లక్షల మంది ఆయకట్టుదారులు సభ్యులుగా ఉన్నారు. ఒక్కొక్క డబ్ల్యూయూఏకు ఒక ఎన్నికల అధికారి, మరొక అసిస్టెంట్ ఎన్నికల అధికారిని నియమించి ఎన్నిక నిర్వహించే ప్రాంగణాలను గతంలోనే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఎంపిక చేశారు. ఎన్నికల అధికారులకు శిక్షణ కూడా ఇచ్చారు. ఎన్నికల అధికారులుగా గెజిటెడ్ హోదా కలిగిన మండల స్థాయి అధికారులను నియమించగా వారంతా తమ పరిధిలోని నీటిసంఘాల ఎన్నికకు నోటిఫికేషన్ ఇచ్చారు. డబ్ల్యూయూఏల ఎన్నికలు 14వతేదీన జరగనున్నాయి. మైనర్ ఇరిగేషన్‌లో ఆరు, మీడియం, మేజర్ విభాగంలో 12 ప్రాదేశికా(టీసీ)లు ఉండగా రైతుల నుంచి టీసీ సభ్యులను తొలుత ఎన్నుకుంటారు.



నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న ఎంపీడీవో శింగయ్య

78 నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

అద్దంకి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి డివిజన్ పరిధిలో 78 నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు నోడల్ ఆఫీసర్, ఎన్నెస్పీ ఈఈ నాగమురళీమోహన్ తెలిపారు. అద్దంకి, సంతమాగులూరు, కొనంకి ఎన్నెస్పీ సబ్ డివిజన్ పరిధిలో 57 మేజర్ నీటి వినియోగదారుల సంఘాలు, పల్నాడు జిల్లా లింగంగుంట్ల డివిజన్ పరిధిలోని కారుమంచి, గోగనకొండ, ప్రకాశం జిల్లా పరిధిలోని దర్శి డివిజన్ పరిధిలో ఉన్న మూడు మేజర్ నీటి వినియోగదారుల సంఘాలు, 16 మైనర్ నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి ఆయా పోలింగ్ స్టేషన్‌ల వద్ద ఓటర్ల వివరాలతో ఆయా సంఘాల అధికారులు నోటిఫికేషన్ ప్రకటించినట్లు తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



సంతమాగులూరులో మాట్లాడుతున్న జీసీడీవో చారులత

పర్చూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను అరికట్టి బాలికలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీడీపీవో సుభద్ర కోరారు. బుధవారం కార్యాలయంలో జరిగిన కిషోర వికాసం బాలికల శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ 11 నుంచి 18 సంవత్సరాల లోపు కిశోర బాలికలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నారు. బాలికలకు లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించాలన్నారు. అనంతరం ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ మాట్లాడుతూ కిశోర్ వికాశ కమిటీలు గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించే విధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇవో వెంకట్రామయ్య, ఏపీఎం రామకృష్ణ, రావి వరలక్ష్మి పాల్గొన్నారు.

సంతమాగులూరు : బాలికల విద్యను ప్రోత్సహించడం ద్వారా బాల్య వివాహాలను నిర్మూలన చేయవచ్చని జిల్లా జీసీడీవో ఎం.చారులత తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోర వికాశం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో సుధారాణి, వైద్యులు నిర్మల్ కుమార్, ఎంఈవో కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చీరాలలో కనకదుర్గ గోల్డ్ లోన్స్ ప్రారంభం

బాపట్ల : ఫైనాన్స్ రంగంలో గత 41 సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందిస్తున్న కనకదుర్గ ఫైనాన్స్ లిమిటెడ్, కనకదుర్గ గోల్డ్ లోన్స్, తమ సంస్థ నూతన శాఖను బాపట్ల జిల్లా, చిరాలలో ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా, దర్బార్ రోడ్డులో బుధవారం ఉదయం ప్రారంభించినట్టు జీఎం జె.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తమ సంస్థకు ఆర్‌బీఐ గుర్తింపు ఉందన్నారు. తమ సంస్థ రూ.5 వేలు నుంచి రూ.50 లక్షల వరకు అతి తక్కువ వడ్డీకి రుణ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. బంగారంపై ప్రతి గ్రాముకు అత్యాధికంగా ఫైనాన్స్ లభిస్తుందన్నారు. అలాగే వ్యాపార, వ్యక్తిగత రుణ సౌకర్యానికి మా సంస్థ ఎంతగానో దోహద పడుతుందని చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎయం కె. శివప్రసాద్, బ్రాంచ్ మేనేజర్ పి.గోవింద మరియు కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.



కనకదుర్గ గోల్డ్ లోన్స్ శాఖను ప్రారంభిస్తున్న జీఎం తదితరులు

విమాన శిఖర గోపుర పునఃప్రతిష్ఠ పూజలు



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పూజారులు

అద్దంకి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని మాధవస్వామి దేవాలయం విమాన శిఖర గోపుర పునఃప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇటీవల దేవాలయం విమాన గోపురాన్ని దొంగలు అపహరించుకుపోయారు. ఈ నేపథ్యంలో పునఃప్రతిష్ఠకు బుధవారం నుంచి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. 14వ తేదీ శనివారం ఉదయం 8-04 గంటలకు పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నారు. బుధవారం నుంచి ప్రారంభమైన పూజా కార్యక్రమాలు గురు, శుక్రవారాలలో కొనసాగి శనివారం ప్రతిష్ఠ కార్యక్రమం జరగనుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సామాజిక స్ఫూర్తితో సేవలు

నా గ్రామమేనా తీర్థక్షేత్రం శంకుస్థాపనలో మంత్రి సత్యకుమార్

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సామాజిక స్ఫూర్తితో సేవలు చేయడమే మానవధర్మం అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని కొలుకుల గ్రామంలో శ్రీ హరిహర సేవా సమితి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'నా గ్రామమే నా తీర్థక్షేత్రం' శంకుస్థాపన మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విశ్వ హిందూ పరిషత్ జాతీయ కార్యదర్శి రాఘవుల ఆశయాలు ఎంతోగొప్పగా ఉంటాయని,ఆయన అడుగుజాడల్లో నేను నడిచి ఇంత ఎత్తుకు ఎదిగానని అన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు సామాజిక బాధ్యత ఉండాలని అన్నారు. నేటి రోజుల్లో గ్రామాన్ని, బంధువులను, కుటుంబ సభ్యులను మరిచిపోతున్న తరుణంలో తన గ్రామానికి ఎదైనా చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమాలు ఎంతో అభినందనీయం అని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్న గురువులకు కృతజ్ఞతలు తెలుపుతూ వారికి పూర్తి స్థాయిలో తోడ్పాటు అందిస్తానని అన్నారు. విశ్వ హిందూ పరిషత్ జాతీయ కార్యదర్శి యక్కలి రాఘవులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక క్షేత్రాలు నిర్మించి ఎంతో మందికి శిక్షణ ఇవ్వాలనే కోరికతో ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని ప్రజలందరూ ఆధ్యాత్మికం, దైవభక్తి, ప్రజా సేవకు అంకితం అవుతారని అన్నారు. ముందుగా మంత్రి సత్యకుమార్ నాయకులు, స్థానికులతో కలిసి స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శంకుస్థాపన ప్రాంగణం వద్ద పూజలు చేసి హారతి నిర్వహించారు. శ్రీ అచలానాంద ఆశ్రమానికి చెందిన విరజానంద స్వామి 'నా గ్రామమే నా తీర్థక్షేత్రం' శంకుస్థాపన మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో 20 సూత్రాల కార్పొరేషన్ చైర్మన్ లంకా దినకర్, రిటైర్డ్ డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎస్వై శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా మాజీ ఆధ్యక్షులు సిరసగండ్ల శ్రీనివాసులు, కూటమి నాయకులు, అర్చకులు, గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి, నాయకులు


చెన్నుపల్లిలో నల్లి దెబ్బకి ఎదుగుదల లేని మిర్చి


తెగులుతో ఎదుగుదల లేకుండా వచ్చిన కాయలు


కొప్పెరపాలెంలో పిచికారీ చేస్తున్న రైతు

మిర్చికి నల్లి తెగులు దెబ్బ


ఎర్రగా వచ్చి ఎదుగుదల లేని మిర్చి తోట

- పలు గ్రామాల్లో ఎదుగుదల లేకుండానే ఎర్రగా వస్తున్న మొక్క
- ఎన్ని రకాలకు మందులు వాడినా అదుపులోకి రాని వైనం
- ఆందోళనలో రైతులు

బల్లికురవ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో రైతులు సాగు చేసిన మిర్చి పైరుకు నల్లి తెగులు వ్యాప్తి చెందడంతో పంట కోతకు రాకుండానే ఎండి పోతోంది. నాలుగేళ్ల నుంచి వరుసగా ఏదో ఒక గ్రామంలో పెద్దఎత్తున వ్యాప్తి చెంది రైతును నష్ట పరుస్తున్న నల్లి తెగులు ఈ ఏడాది కూడా అలానే రైతులను కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. లక్షలు పెట్టుబడులు పెట్టి పంట సాగు చేసిన దిగుబడులు వచ్చే సమాయానికి తెగులు వచ్చిందని కాయలు పడకుండానే ఎర్రగా మిర్చి మొక్కలు వచ్చి ఎండుముఖం పట్టాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని రకాల పురుగు మందులు వాడినా ఫలితం లేకుండా పోతుందని రైతులు అంటున్నారు.

బల్లికురవ మండలంలోని, చెన్నుపల్లి, నక్కబొక్కలపాడు, కొణిదెన, కొప్పెరపాలెం, గంగపాలెం, వేమవరం, ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు, రామాంజనేయపురం, ఎస్ఎల్ గుడిపాడు, వెలమవారిపాలెం, కొత్తూరు, వల్లాపల్లి, అంబడిపూడి, గుంటుపల్లి, బల్లికురవ, కె.రాజుపాలెం తదితర గ్రామాలలో రైతులు ఈ ఏడాది పెద్ద ఎత్తున మిర్చి పంటను సాగు చేశారు. కొన్ని గ్రామాలలో మిర్చి కోతలు కూడా ప్రారంభం అయ్యాయి. మిర్చికి ఎర్రనల్లి తెగులు రోజురోజుకు వ్యాప్తి చెందుతుంది. మిర్చి మొక్క అడుగుభాగం నుంచి ఎర్రగా వచ్చి ఎదుగుదల లేకుండా నిట్ట నిలువునా ఎండుతున్నాయి. వీటిని చూసిన రైతులు కొందరు పంట బెట్టకు వచ్చింది అని నీటిని పెడుతున్నారు. మిర్చి మాత్రం ఎర్రగా వస్తుంది. రైతులు తెగులు ఉందని తెలిసి లక్షలు వెచ్చించి పలు రకాల పరుగు మందులను వాడుతున్నారు. ముందుగా తెగులు విషయం తెలుసుకొని మందులు వాడినా పంటలు కొంత వరకు తెగులు బారి నుంచి తప్పించుకుంటున్నాయి. మందులు వాడకం ఆలస్యం చేసిన పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయి. కొందరు రైతులు తెగులు వచ్చిన పంటలను కోతలు కోయకుండా వదిలేస్తున్నారు. వచ్చిన కాడికి దిగుబడులు వస్తే పండు కాయలు కోసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. ఏటా ఎర్ర నల్లి తెగులు కొంప ముంచుందని రైతులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.60వేల వరకు పెట్టుబడులు పెట్టామని తెగుల వలన తీవ్ర నష్టం తప్పదని వారు అంటున్నారు. తెగుళ్లతో పైరును తీసి వేసేందుకు కొందరు సిద్ధపడుతున్నారు. కొందరు రైతులు మాత్రం పురుగు మందులు వాడి కాపాడుకోవాలనే పట్టుదలతో ముందుకు వెళుతున్నారు. అధికారులు వెంటనే గ్రామాలలో సాగులో ఉన్న మిర్చిని పరిశీలించి నల్లి తెగులును అదుపులోకి తీసుకు వచ్చేలా చర్యలు చేపట్టాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.


దీక్షధారులతో ఎమ్మెల్యే కొండయ్య, ఆయన కుమారులు

మాలధారణం.. నియమాల తోరణం

ఇరుముడి మహోత్సవంలో ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మాలధారణం.. నియమాల తోరణం. మండల కాలం దీక్షలో ఉండి ఇరుముడితో శబరిమలకు వెళ్లి అయ్యప్పను దర్శించే భాగ్యం దీక్షధారులకే సాధ్యమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని బుర్లవారిపాలెంలో 40 రోజుల పాటు అయ్యప్ప దీక్షలో ఉండి బుధవారం ఇరుముడి కట్టుకుని శబరిమలకు వెళ్లే భక్తులకు ఎమ్మెల్యే కొండయ్య, ఆయన పెద్ద కుమారుడు గౌరీఅమర్‌నాథ్, చిన్న కుమారుడు, టీడీపీ నియోజకవర్గ అధికారి ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ కలసి, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కన్నె స్వాములు, కత్తి స్వాములు, గంట స్వాములు ఇలా వివిధ దశల్లో పయనమవుతున్న దీక్షధారులకు వీడ్కోలు పలికారు. యాత్రను దిగ్విజయంగా ముగించుకుని క్షేమంగా తిరిగిరావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, దీక్షధారులు, వారి బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.

నీటి సంఘ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

పంగులూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నీటి వినియోగదారుల సంఘ ఎన్నికలు ఈనెల 14 జరగనున్నాయి. బుధవారం సంబంధిత ఎన్నికల అధికారులు ఆయా కేంద్రాల పరిధిలో నోటిఫికేషన్ విడుదల చేశారు. అద్దంకి సబ్ డివిజన్‌లోని జె.పంగులూరు వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలో ఉన్న పంగులూరు - 1, జె.పంగులూరు - 2, కొండమంజులూరు - 1, చందలూరు - 1, కోణంకి వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలోని కొండ మంజులూరు - 2 నీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించి బుధవారం మండలంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 14వ తేదీన ఉదయం 8 గంటలకు ఆయా నీటి వినియోగదారుల సంఘ పరిధిలోని వార్డు సభ్యుల ఎన్నికకు నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ల ప్రక్రియ అనంతరం వార్డు సభ్యుల ఎన్నిక నిర్వహిస్తారు. ఇది పూర్తయిన అనంతరం అదే రోజు ఎన్నికైన సభ్యులను సమావేశ పరచి సంబంధిత నీటి వినియోగదారుల సంఘ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారని అధికారులు తెలిపారు. నీటి వినియోగదారుల సంఘాల ఎన్నిక జరిగే కేంద్రాలతో పాటు, గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద నోటిఫికేషన్ వివరాలను వెల్లడించారు. ఈనెల 17వ తేదీన డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక జరుగుతుందని అద్దంకి సబ్‌డివిజన్ డీఈ రామకృష్ణ తెలిపారు.

జన గర్జనను జయప్రదం చేయండి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు


అద్దంకిటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెదూర్తిలో ఈనెల 20, 21 తేదీల్లో జరిగే నూర్‌బాషా దూదేకుల జన గర్జనకు విద్యార్థులు, యువకులు, వ్యాపారులు తరలివచ్చి జయప్రదం చేయాలని సంఘ నాయకులు కోరారు. గురువారం అద్దంకిలోని రఫీ కార్యాలయంలో పట్టణ, మండల నూర్ బాషా దూదేకుల సమావేశం జరిగింది. జన గర్జన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు షేక్ మహమ్మద్ రఫీ, రాష్ట్ర నూర్ బాషా యువజన కార్యదర్శి కొటికలపూడి శ్రీను, పట్టణ అధ్యక్షుడు సుభాని, ఉపాధ్యక్షుడు షేక్ మాబు, సైదా వలి, నాయకులు పాల్గొన్నారు.

16న బహిరంగ వేలం పాటలు

వేటపాలెం, చీరాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రామన్నపేట పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీకనక నాగవరపమ్మ అమ్మవారి దేవస్థానంలో వివిధ అంశాలకు సంబంధించిన బహిరంగ వేలంపాటను ఈ నెల 16వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి పోతిని శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఆలయ ప్రాంగణంలో కొబ్బరికాయలు, పూజా ద్రవ్యాలు, శీతల పానీయాల విక్రయాలు, టెంట్ సామాను, వంట పాత్రలు అద్దెకు ఇవ్వడం, అమ్మవారికి సమర్పించే చీరలు, జాకెట్లు, తలనీలాలు, చెవిపోగులు, పొట్టేలు మొక్కు చెల్లింపు అనంతరం ముక్కుకట్టడం తదితర అంశాలకు సంబంధించి బహిరంగ వేలం పాటులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పాటలో పాల్గొనేవారు ముందుగా రూ.10వేల దరావత్తు చెల్లించాలని కోరారు. సమాచారం కోసం ఆలయం వేళల్లో సంప్రదించాలని సూచించారు.

మద్యం అక్రమ విక్రయాలపై ఉక్కుపాదం

ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు


మద్యంను స్వాధీనం చేసుకున్న సీఐ

చీరాలటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విధానాలకు భిన్నంగా మద్యంను అక్రమంగా విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు హెచ్చరించారు. బుధవారం ఉజిలీపేట పరిధిలో దాడులు నిర్వహించారు. అదే ప్రాంతానికి చెందిన మూకిరి క్రాంతి కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మద్యం బాటిళ్లను అక్రమంగా విక్రయిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఆయనవెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

ఆటో డ్రైవర్ మోసం

వృద్ధుడి నుంచి నగదు అపహరించి పరారీ

పర్చూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్ మోసానికి వృద్ధుడు లబోదిబోమన్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన చిమటా వెంకటేశ్వర్లు పర్చూరు వచ్చేందుకు నూతలపాడువద్ద ఆటో ఎక్కారు. నూతలపాడు గ్రామం దాటిన క్రమంలో ఆటోను రోడ్డు పక్కనే పొలాలకు వెళ్లే డొంకలోకి ఆటోను తీసుకువెళ్లి వృద్ధుని వద్ద ఉన్న రూ.11వేల నగదును లాక్కొని ఆటో డ్రైవర్ పరారాయ్యాడు. దీంతో ఆ వృద్ధుడు లబోదిబో మంటూ మరో వాహనంలో వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ వర్గీయుల దాడి

ఈపూరుపాలెంలో కేసు

చీరాలటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని గవినివారిపాలెంకు చెందిన టీడీపీ కార్యకర్త నక్కల వెంకటేశ్వర్లు అలియాస్ పండుపై పలువురు వైసీపీ వర్గీయులు దాడిచేసి గాయపరిచారు. ఈ ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తగా కీలకంగా ఉన్న వెంకటేశ్వర్లు గ్రామంలో ఏర్పాటు చేస్తున్న బ్యానర్‌లను దబ్బకూటి శ్రీనివాసరావు, గవిని నాగరాజు మరి కొందరు చించి వేస్తున్నారు. అలాగే బుధవారం గ్రామంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వెంకటేశ్వర్లు అడ్డంగా నిలబడి దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సమీక్షలో పాల్గొన్న పీడీ విజయలక్ష్మి

ఉపాధి కల్పనకు కృషి చేయాలి

పీడీ విజయలక్ష్మి

చీరాలటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కొత్త సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ కార్మికులకు ఉపాధి కల్పనకు కృషి చేయాలని పథకం పీడీ విజయలక్ష్మి అన్నారు. జాతీయ ఉపాధిహామీ జిల్లాస్థాయి సమీక్షా సమావేశం బుధవారం చీరాలలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పొలాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 100 రోజుల పని కల్పించే దిశగా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ప్లాంటేషన్ వర్క్‌లను యాప్‌లో విధిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. హార్టికల్చర్‌లో భాగంగా పండ్ల తోటలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటించాలన్నారు. మినీ గోకులాలు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ బిల్డింగ్ రీచార్జ్ గుంతలను ఏర్పాటు చేయాలని చెప్పారు. హౌసింగ్ లబ్ధిదారుల 90 రోజుల పనిదినాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఏడాది 100 రోజుల పని దినాలను గుర్తించి యాప్‌లో అప్‌లోడు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ కోటయ్య నాయక్, ప్లాంటేషన్ మేనేజర్ కిరణ్, జిల్లా పరిధిలోని అన్ని మండలాల టెక్నికల్ అసిస్టెంట్‌లు, టీఏఫ్ టీలు, ఈసీలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

బల్లికురవ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రైతులంతా పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని బాపట్ల రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ రత్నకుమారి కోరారు. బుధవారం మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో పొలంపిలుస్తోంది. కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా రైతు శిక్షణ కేంద్రం నుంచి వచ్చిన ఏడీఏ రత్నకుమారి, బల్లికురవ ఏవో కుమారి పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. పంటల బీమాను ప్రతి ఒక్కరు చేయించుకోవాలని సూచించారు.

పంగులూరు : రబీలో సాగు చేసిన పంటలకు పంట బీమా చేయడంతో పాటు పంట నమోదు విధిగా చేయించాలని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి రైతులకు సూచించారు. భైటమంజులూరు, ముప్పవరంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగులో ఉన్న మొక్కజొన్న పంటను రైతులతో కలసి పరిశీలించి పురుగు నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది దిల్షా, పృధ్వీ, రైతులు పాల్గొన్నారు.

చీరాలటౌన్ : కత్తెర పురుగు నివారణకు సమగ్ర సస్య రక్షణకు కచ్చితంగా కొన్ని నియమాలు పాటించాలని వాటిపై రైతులు అవగాహన పొందాలని వ్యవసాయాధికారి సుమతి అన్నారు. కావూరివారిపాలెం, దేవినూతల గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమతి మాట్లాడుతూ కత్తెర పురుగు తొలి దశలో ఎకరాకు 5 శాతం వేప గింజల కషాయం పిచికారీ చేయాలని సూచించారు. గొంగళి పురుగు నివారణకు 10 కిలోల తవుడు, రెండు కిలోల బెల్లం, రెండు లీటర్ల నీటిని కలిపి 2 గంటల పాటు పులియబెట్టి ఆ మిశ్రమాన్ని సాయంత్రం వేళల్లో సుడులలో లేదా మొవ్వులలో వేయాలని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏలు ఆఫియా, హేడ్నా, రైతులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : వరిలో ఉల్లికోడు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని రామాయపాలెం, తిమ్మాయపాలెంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉల్లికోడు లక్షణాలు కనిపిస్తున్నాయని, పిలకలు గొట్టాలుగా సన్నాగా కనిపిస్తున్నాయని, గాలిలో తేమశాతం 80 నుంచి 90శాతం ఉన్నప్పుడు ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. దీని నివారణకు నారు మడిలో కార్బోఫ్యూరాన్, 3 జి గుళికలు వేసుకోవాలని, పైరు పెద్దదయిన తరువాత కార్బోసల్ఫాన్ 400 ఎంఎల్ ఎకరాకు లేదా ఫిప్రోనిల్ 400 ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఉద్యాన శాఖ అధికారి ఎస్.దీప్తి, వీఏఏ ఖాజాబి, రైతులు పాల్గొన్నారు.

సంతమాగులూరు : రైతులు సాగుచేస్తున్న పంటలను తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి రామినేని లావణ్య తెలిపారు. మండలంలోని కుందుర్రు గ్రామ రైతు సేవా కేంద్రంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం


అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ గోపీకృష్ణ

చీరాలటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గోపీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం చీరాల మండల పరిధిలోని బుర్లవారి పాలెంలో సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా అర్జీదారుల నుంచి వచ్చిన 39 అర్జీలను తహసీల్దార్ స్వీకరించారు. వాటిని ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించనున్నట్లు చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ అర్జున్, సర్వేయర్ బ్రమణయ్య, ఆర్‌ఐ నాగకుమార్, ఏవో సుమతి, ఎండోమెంట్ ఈవోలు శివనాగదాసు, కృపారావు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, అర్జీదారులు పాల్గొన్నారు.

పంగులూరు : రెవెన్యూ సదస్సుల ద్వారా రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించుకోవాలని ప్రత్యేకాధికారి రాజేష్‌కుమార్ సూచించారు. మండలంలోని కొండమంజులూరు గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. సదస్సుకు ముందు తహసీల్దార్ సింగారావు ఎస్సీ కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సదస్సులో తహసీల్దార్ సింగారావు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల భూ సమస్యల పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన సదస్సులను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ప్రజల నుంచి 29 దరఖాస్తులు రాగా, నాలుగు సమస్యలను పరిష్కరించి ధ్రువపత్రాలను రైతులకు అందచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపారాణి, ఈవోఆర్డీ సుమంత్, సర్వేయర్ సురేష్, నాయకులు చింతల సహదేవుడు, బత్తుల వెంకటరావు, వీఆర్వో వెంకటేశ్వర్లు, కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రామ సర్వేయర్ ప్రసన్నబాబు, రైతులు పాల్గొన్నారు.

చినగంజాం : రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కారిస్తామని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. మండలంలోని మున్నంవారిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించి పలు సమస్యలపై ఆయన అర్జీలను స్వీకరించారు. మ్యూటేషన్ కోసం ఐదు, భూ కొలతలకు ఏడు, కుల ధ్రువీకరణ సర్టిఫికేట్‌కు ఒకటి, ఆదాయ ధ్రువీకరణకు అర్జీ అందినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్వేయర్ సుబ్బారావు, ఇన్‌చార్జి ఆర్‌ఐ నాగేశ్వరరావు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

పర్చూరు : రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ పీ బ్రహ్మయ్య కోరారు. బుధవారం మండల పరిధిలోని నూతలపాడు, చింతగుంటపాలెం గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలను నిర్వహించారు. ఈసందర్భంగా నూతలపాడులో సర్పంచ్ కాకర్లమూడి చిన్న అధ్యక్షతన సదస్సులో రైతుల నుంచి అర్జీలను తహసీల్దార్ స్వీకరించారు. కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారి దామా నాగేశ్వరరావు, డాక్టర్ ఏకాంబరేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బీ ప్రేమ్‌కుమార్, సర్వేయర్ అరుణ, నాయకులు విన్నకోట సతీష్, కంచేటి శ్రీహరి, విన్నకోట అజయ్, రైతులు పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు

ప్రయాణికులకు తీరనున్న ఇక్కట్లు


గుంతలను పూడ్చుతున్న కార్మికులు

పర్చూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోక ధ్వంసమైన రోడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తొలుత రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఉన్న రహదారులను బాగు చేయించేలా చర్యలు తీసుకుంది. పర్చూరు - యద్దనపూడి రహదారి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చి రాకపోకలకు ఇబ్బంది లేకుండా పనులు చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి పలువురు టీడీపీలో చేరిక

ఆహ్వానించిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు బుధవారం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. స్థానిక 31వ వార్డుకు చెందిన నాగేంద్రమణి ఇటీవల టీడీపీలో చేరారు. ఈ క్రమంలో ఆమె ఆధ్వర్యంలో తాజాగా మరికొందరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ముందుగా నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలలో పలవవురు మాట్లాడారు. ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా అందరం కలసి పనిచేద్దామన్నారు. బుడా ఛైర్మన్ సలగల రాజశేఖరబాబు మాట్లాడుతూ అందరికీ ఆమోదయోగ్యమైన పాలనను కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. క్రీస్తు శాంతి సందేశం అందరికీ అనుసరణీయమని వక్తలు, సంఘ కాపర్లు పేర్కొన్నారు. కేక్ కట్ చేశారు. వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


కృష్ణవేణమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యేలు ఏలూరి, వేగేశన

కృష్ణవేణమ్మకు ఎమ్మెల్యే ఏలూరి నివాళి

జాగర్లమూడి (పర్చూరు), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జాగర్లమూడి టీడీపీ గ్రామ సీనియర్ నాయకుడు మద్దుకూరి నెహేమియారావు తల్లి కృష్ణవేణమ్మ దశదిన కర్మ సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతిచేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. కార్యక్రమంలో నాయకులు ధూళిపల్లి వెంకటస్వామి, యద్దనపూడి మండల పార్టీ అధ్యక్షులు నన్నపనేని రంగయ్య చౌదరి, కనపర్తి నాగేశ్వరావు, మద్దుకూరి మృత్యుంజయరావు, మార్కేండేయులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

మార్టూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం ఇంటర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను గణిత శాస్త్ర అధ్యాపకుడు చిలకాదేవదాసు ప్రిన్సిపాల్ డీవీ శ్రీనివాసరావు చేతుల మీదగా అందజేశారు. ఇంటర్ మీడియట్ బోర్డు వారిచే రూపొందించిన ప్రశ్నల నిధి సమాధానాల మెటీరియల్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు.

వాలీబాల్ పోటీల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థుల ప్రతిభ


గెలుపొందిన వాలీబాల్ జట్టుతో సెయింట్ ఆన్స్ కళాశాల ప్రతినిధులు

చీరాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నర్సారావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన జేఎన్‌టీయూ (కాకినాడ) సెంట్రల్ జోన్ ఇంటర్ కాలేజీ వాలీబాల్ పోటీలలో సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు విజేతలుగా నిలిచారు. ఈ నేపథ్యంలో బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పోటీలలో గెలుపొందిన వాలీబాల్ జట్టు సభ్యులను కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తదితరులు అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీష్‌బాబు మాట్లాడుతూ పోటీల పూర్వాపరాలను వివరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 28 కళాశాలల నుంచి వాలీబాల్ జట్లు పాల్గొన్నాయన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు అన్నం శ్రీనివాసరావు మాట్లాడుతూ గెలుపొందిన జట్టులో ఆర్.రమణ, జి.తేజారెడ్డి, జి.మైఖేల్, కె.సన్నీ, కె.సాయికుమార్, డేని, చంద్రశేఖర్, ఆండ్రూస్, నాని, సాయికృష్, చంద్రశేఖర్, రేవంత్ ఉన్నారన్నారు. మేనేజర్ ఆర్వీ రమణమూర్తి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.